Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018
# ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
Published from Kurnool ···· Circulated by Andhrapradesh, Telangana & New Delhi
సంపుటి :04 సంచిక : 164 పేజీలు 8 వెల : 5 బుధవారం 31 డిసెంబర్ 2025

విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో
మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత తెలుగు దినపత్రికకు మరియు UV9 కేబుల్ TV చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను
ఉత్తేజిత దినపత్రిక UV9
Contact : 94401 40418, 63038 17489


2లో..

## కెసిఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

పాలమూరు-రంగారెడ్డిపై మాట్లాడుతారా

రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఇదే చర్చ

2న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ



# వైకుంఠనాథుడి వైభోగం

తిరుపతి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా దర్శించుకున్నారు. పది రోజుల పాటు కొనసాగే ఈ దర్శన భాగ్యం.. మంగళవారం గోవిందనామ స్మరణల మధ్య ప్రారంభమైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక 12.05 గంటలకు తితిదే అధికారులు, అర్చకులు శ్రీవారి ఆలయం తెరచి, మూలమూర్తికి ధనుర్మాస కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం వీవీఐపీలు, వీఐపీలకు వైకుంఠ ద్వారం మీదుగా దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 7.20 గంటలకు ఈ-డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ పర్వదినం సందర్భంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణ రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివార్లకు రథరంగ డోలోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు, భక్తులు రథాన్ని లాగారు.

**అణువణువునా కనువిందుగా..**

శ్రీవారి ఆలయంతో పాటు తిరుమల వ్యాప్తంగా ప్రత్యేక అలంకరణలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆలయ మహాద్వారం నుంచి ధ్వజస్తంభం వరకు, వైకుంఠ ద్వారంలో సంప్రదాయం ఉట్టిపడేలా పలురకాల పండ్లు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలు, పత్రాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ప్రదక్షిణ చేసే భక్తులు దివ్యానుభూతికి లోనవుతున్నారు. తూర్పు మాడవీధిలో శ్రీరంగనాథస్వామి ఆలయ నమూనా అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది. తితిదే ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో దాత సహకారంతో దీన్ని ముస్తాబు చేశారు. వైకుంఠ ద్వాదశి సందర్భంగా బుధవారం ఉదయం 4.30 నుంచి 5.30 గంటల నడుమ శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం శ్రీవారి పుష్కరిణిలో జరగనుంది.

**ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి: ఛైర్మన్ బీఆర్ నాయుడు**

ప్రధాన ఆలయం, బయట క్యూలైన్లలో పరిస్థితిని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి నిరంతరం పరిశీలించారు. మీడియాతో బీఆర్ నాయుడు మాట్లాడుతూ 'గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి భక్తులకు ఏ ఇబ్బందులూ తలెత్తకుండా అద్భుత ద ఏర్పాట్లు చేశాం. కట్టుదిట్టమైన పర్యవేక్షణ నడుమ భక్తకోటి స్వామివారి సేవలో తరిస్తున్నారు. ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు' అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు ఈసారి వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యమిచ్చామని ఈవో సింఘాల్ తెలిపారు. వీఐపీలకు దాదాపు 4,750 టికెట్లు జారీ చేశామని చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ-డిప్ విధానం విజయవంతమైందని హర్షం ప్రకటించారు.



# కూతపెడుతున్న పందెం కోడి

అమరావతి: మన రాష్ట్రంలో సంక్రాంతి అనగానే గుర్తొచ్చేవి కోడి పందేలు. పొరుగు రాష్ట్రాలవారే కాదు విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు కూడా సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి పందేలు వీక్షించడానికి తహతహలాడతారు. అంత క్రేజ్ ఉన్న కోడిపందేలకు 'బరి'లో దిగే కోళ్లు మామూలుగా ఉంటే ఎలా? అందుకే వాటి ఎంపిక నుంచి శిక్షణ వరకు, అది తినే డైట్ నుంచి బరిలో చేసే ఫైట్ వరకు అన్నీ ఆసక్తికరమే. ప్రధానంగా ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు కోడిపందేలకు పెట్టింది పేరు. తెలుగింటి పెద్ద పండగకు సంప్రదాయ క్రీడలుగా మొదలైన కోడి పందేలు ఆ నాలుగు రోజులు అతి పెద్ద జూదంగా, కోట్లలో పందేలు కాసే స్థాయికి వెళ్లిపోయాయి. ఈ శిక్షకులు స్పెషల్‌బ్రాండింగ్ ఉండి, గతంలో పందేల్లో గెలిచిన ఎక్కువ కోళ్లకు శిక్షణనిచ్చిన కాక్ ట్రైనింగ్ సెంటర్‌ల వారితో శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నిస్తుంటారు.

# బెంగాల్లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి


2లో..

అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ

తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత


2లో..

కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సీఎం

ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా


2లో..

## కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి

శంకర్ గుప్తం మురుగుకాల్వ పూడికతీతకు శంకుస్థాపన

రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం

# బంగ్లాదేశ్‌లో ఆగని దాడులు మరో హిందువు దారుణ హత్య



2లో..

వరుసగా హిందువులే లక్ష్యంగా అక్కడి ముష్కర మూకలు కాల్పులకు తెగిస్తున్నాయి. దీపూచంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరవక ముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు.

# గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్

**రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను కొట్టేసిన ఏపీ హైకోర్టు**

అమరావతి:ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్ దక్కింది. గ్రూప్-2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. కాగా, 2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై రిజర్వేషన్ల విధానాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని కోరుతూ అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, పాత నోటిఫికేషన్‌కు బదులు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు కోరారు. రిజర్వేషన్ల పాయింట్లను సవాల్ చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు.



## తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు


2లో..

- క్రైమ్ రేటును బాగా తగ్గించగలిగాం
- పంచాయితీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం
- ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం
- 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డిజిపి శివధర్ రెడ్డి

గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్తా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా షికా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

కోల్‌కతా: భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

## బెంగాల్లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి

**అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ**

కోల్‌కతా: బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు.

భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్‌ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేయడం కుట్ర కాదా అని అన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని దాడులు

**మరో హిందువు దారుణ హత్య**

ఢాకా: బంగ్లాదేశ్ లో హిందువుల హత్యలు కొనసాగుతున్నాయి. వరుసగా హిందువులే లక్ష్యంగా అక్కడి ముష్కర మూకలు కాల్పులకు తెగిస్తున్నాయి. దీపూచంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరవక ముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురిపెట్టానని..అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై అల్లరిమూకలు దాడి చేసి హత్య చేశాయి. అది మరవకముందే ఇటీవల మరో హిందూ యువకుడిని రాజ్‌బరి జిల్లా పంగ్షా సర్కిల్‌లో గ్రామస్థులు కొట్టి చంపారు. తాజాగా మరో హత్య జరగడంతో ఆ దేశంలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# కోనసీమ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ దృష్టి



అంబేద్కర్ కోనసీమ:కోనసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కేసనపల్లి తుఫాన్ సెంటర్‌లో శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాలువకు సంబంధించిన ఎనిమిది కిలోమీటర్లు పొడవునా పూడికతీత పనులు,14.5 కిలోమీటర్ల పొడవునా గట్ల పటిష్ఠత పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఇటీవల రాజోలులో తన పర్యటన సందర్భంగా 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. 35 రోజుల్లోపే ఈ సమస్యకు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ క్రమంలో అధికారులకు పవన్ కీలక సూచనలు చేశారు. రాజోలు నియోజకవర్గ రైతులకు ఐదేళ్లుగా దుఖ:దాయనిగా మారిన శంకర్ గుప్తం మేజర్ డ్రైనేజ్ సమస్యను సుబ్రహ్మణ్య షష్టి రోజున గుర్తించామని తెలిపారు. కేవలం 34 రోజుల కాలవ్యవధిలో శాశ్వత పరిష్కారం దిశగా ముక్కోటి ఏకాదశిన పనులు ప్రారంభించామని వెల్లడించారు. ఈ పనులకు రూ.20.62 కోట్లు కేటాయించామని అన్నారు. శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాల్వతో వరి, కొబ్బరి చెట్లను రైతులు కోల్పోయారని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు వివరించారు. కేవలం 34 రోజుల్లోనే ఈ పనుల నిర్వాహణకు నిధులు కేటాయించామని చెప్పుకొచ్చారు. కొబ్బరి చెట్లకు నష్టం కలుగకుండా సంరక్షణ చర్యలు చేపడతామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.4 వేల కోట్లతో పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకీకరిస్తామని తెలిపారు. కోనసీమ ప్రాంతనీలో కోకో బోర్డు ఏర్పాటు చేయడానికి కేంద్రప్రభుత్వంతో సంప్రదిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీ బిఆర్‌ఎస్ లీడర్ల నియామకం



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో బీఆర్‌ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్‌ఎస్ ఎ÷–లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్‌ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడు తుందని ఆ పార్టీ నేతలు చెబుతు న్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్‌ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్‌ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్‌ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్‌ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడం లో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా షికా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు.

# విజయవాడ రహదారిపై కన్నేయండి

హైదరాబాద్: సంక్రాంతి నేపథ్యంలో జాతీయ రహదారులపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఏటా సంక్రాంతి ముందు ఈ రహదారిపై వాహనాల రద్దీ వల్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. గతంలో ఎదురైన అనుభవాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ అంశంపై దృష్టి పెట్టారని చెప్పారు. హైదరాబాద్–విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు లక్ష వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. బుధవారం తూప్రాన్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. ప్రధానంగా ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ఈ ప్రాంతాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌జామ్ కావడానికి వీల్లేదు. పండగ రద్దీ ఉన్నన్ని రోజులూ రోడ్లు మూసేయొద్దు. భారీ యంత్రాలతో పనులు చేపట్టవద్దు. అత్యవసరమైనవి అయితే ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. రోడ్లపై మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలను పూర్తిగా తొలగించాలి. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోటా పగలు, రాత్రి స్పష్టంగా కనిపించేలా ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై–విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించేలా ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ఎ÷–లాజాల వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

## జివో 252తో జర్నలిస్టులకు అన్యాయం

హైదరాబాద్: అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహాలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. ఈ మేరకు సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

# కెసిఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

హైదరాబాద్: కెసిఆర్ తొలిరోజు అసెంబ్లీకి వచ్చారు. మళ్లీ వస్తారా అని అందరి అభిప్రాయంగా ఉంది. అసెంబ్లీలో ఆయన మాట్లాడితే చూడాలని కూడా చాలాంది అభిప్రాయంగా ఉంది. కెసిఆర్ మీడియా ముందుకన్నా, అసెంబ్లీలో తన వాణి వినిపించి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నారు. 2న తిరిగి అసెంబ్లీ సమావేశం కానుంది. అయితే కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అంటూ గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న వేళ, సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. కేవలం కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. ఆయనకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సోమవారం ఎట్టకేలకు శాసనసభలో వచ్చి కూర్చున్నారు. సభలోకి వచ్చిన కొద్ది నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. అయితే, ఆయన చర్య గులాబీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. వెంటనే ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కేసీఆర్ తిరిగి కొత్త సంవత్సరం రెండో రోజు నుంచి జరిగే సమావేశాలకు వస్తారా? లేదా? అనే కొత్త చర్చ రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. కేసీఆర్ తప్పకుండా సభకు వస్తారని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై మాట్లాడతారని బీఆర్‌ఎస్ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నాయి. ఎందుకంటే కెసిఆర్ వస్తారని, మాట్లాడుతారని గతకొంత కాలంగా హరీష్ రావు, కెటిఆర్‌ఉ చెబుతూ వచ్చారు. సోమవారం కేసీఆర్ శాసనసభకు రావడం ఖరారు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయమే పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. దాంతో అక్కడంతా హడావుడి కనిపించింది. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయన మొదట అసెంబ్లీ లాబీలో తనకు కేటాయించిన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడే సభకు సంబంధించిన హాజరు నమోదు పత్రంలో సంతకం చేశారు. తర్వాత అసెంబ్లీ హాల్లోకి వెళ్లి కూర్చున్నారు. కొద్ది నిమిషాల్లోనే తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై చర్చ జరుపుదామని, కేసీఆర్ సభకు రావాలంటూ ఈ మధ్యకాలంలో అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనవరి రెండు లేదా మూడో తేదీన కేసీఆర్ శాసనసభకు వస్తారని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో చర్చించే అంశాలపై స్పష్టత వచ్చాక, చర్చించే అంశాలను బట్టి కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా, గత ప్రభుత్వాల ప్రతిపాదనలు, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక తీసుకున్న నిర్ణయాలపై కేసీఆర్ మాట్లాడతారని సమాచారం. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి వల్ల రెండు జిల్లాల రైతులకు ఎలాంటి నష్టం జరగనుందో కేసీఆర్ ప్రస్తావిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇదే అంశంపై క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసి, ప్రజల్లోకి వెళ్తారని అంటున్నారు. రెండు అంశాలపై అసెంబ్లీ వేదికగా ఏం చెప్పాలి? ఇప్పటివరకు ఎదురైన ఇబ్బందులు, భవిష్యత్‌లో ఏర్పడే ప్రమాదాలు వంటి వాటిపై కేసీఆర్ సంబంధిత నిపుణులతో చర్చలు జరుపుతూ సన్నద్ధం అవుతున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

# కొత్త జిల్లాల ఏర్పాటుపై నోటిఫజకేషన్ జారీ

**కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటు**

**కొత్త జిల్లాలతో 28కి పెరిగిన జిల్లాల సంఖ్య**

అమరావతి: రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇక రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి మారనుంది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నదాని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరుల సేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్ని విధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సమగ్ర సేవలు, వేగవంతమైన పరిపాలన, వనరుల సమర్థవంతమైన వినియోగం అందించగలిగే అవకాశాలు పెరుగుతాయని ఏపీ సర్కార్

అనుకుంటుంది. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మార్చారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలక మార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్టక్చర్ చేయడం, పెనుగొండను వాసవీ పెనుగొండుగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాల సరిహద్దులను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది.

## ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయాలి



:పంట మార్పిడి వల్ల అధిక దిగుబడి : ఏవో షేక్షావలి

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు డిసెంబర్ 30 :**

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయాలనే లక్ష్యంతో మంగళవారం నందికొట్కూరు మండలంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ అనుబంధ శాఖలు, రైతు సాధికార సంస్థ, సెర్ప్%-%వెలుగు సంస్థల సమన్వయంతో పకృతి వ్యవసాయమే అజెండాగా మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ తరపున మండల వ్యవసాయ అధికారి షేక్షావలి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా పంట మార్పిడి దిబ్బ ఎరువులు. పచ్చి రొట్టెలు భూమిలో సారవంతం చేసుకుని వివిధ రకాల పంటలు వేసి పురుగు తెగులను అదుపులో ఉంచడంతోపాటు వేప గింజలు కషాయము జీవామృతము పుల్లటి మజ్జిగ సహజ సాగు విధానములో అమలు చేయాలని ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించి ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయాన్ని పరిచయం చేయాలని వివరించడం జరిగింది ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని సూచించారు. అలాగే ప్రతి రైతు తప్పకుండా విత్తన శుద్ధి చేసుకోవాలని, అలాగే పంటల మార్పిడి ఉండాలని ఒకే పంట ప్రతిసారీ వేస్తే దిగుబడి తగ్గుతుంది అని రైతులు వినూత్న పంటల సాగు అలవాటు చేసుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో. షేక్షావలి సెర్ప్ ఏపిఎం శ్రీనివాసులు మరియు సిసిలు దాసు. రమణ . కృష్ణమూర్తి మరియు మండల సమాఖ్య, అధ్యక్షురాలు మరియు ఓబి మెంబర్సఆర్ ఎస్ కె సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరేంద్ర రవీంద్రనాథ్ అయ్య స్వామి పరమేశు దాసు కలీముల్లా శాకద్రి ఎంపీవోలు, వెలుగు సీసీలు, వివోఏలు, ఐసీఆర్పీలు, మండల సమాఖ్య మహిళా సభ్యులు, ప్రకృతి వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కలియుగ దైవం శ్రీ శ్రీ శ్రీవెంకటేశ్వర స్వామి దర్శించుకున్న :ఎమ్మెల్యే గిత్త జయ సూర్య , మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి

**ఉత్తిజిత ప్రతినిధి నందికొట్కూరు డిసెంబర్ 30 :**



వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్న నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మరియు నందికొట్కూరు టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి లు కుటుంబ సమేతంగా దర్శించుకోవడం జరిగింది.


## శ్రీగిరిలో ఘనంగా ముక్కోటి వేడుకలు:

**వేల సంఖ్యలో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు.**

**సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్**









“ నేల ఈనిందా!! దివి వైకుంఠం భువికి దిగి వచ్చిందా!!” అన్నట్లు ముక్కోటి వేళ శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం మంగళ వారం భక్తజనంతో కిటకిటలాడింది. అన్ని దారులు శ్రీగిరికే అన్నట్లు వేల సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండే తమ ఇష్ట దైవం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో బారులు తీరారు, గోవిందో గోవింద! అంటూ భక్తులు తన్మయత్వంతో పిలిచే పిలుపులతో శ్రీగిరి ప్రతిధ్వనించింది.

వైకుంఠ ఏకాదశి ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు, ఉభయ దేవేరులతో కూడి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు,

శ్రీగిరిలో నూతనంగా ప్రవేశ పెట్టిన శీఘ్ర దర్శనం పథకం విజయవంతమైంది.. శ్రీగిరి మెట్ల మార్గం ద్వారా కూడా భక్తులు శ్రీగిరికి చేరుకున్నారు, . ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ సతీ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వర రావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పలు రంగాల ప్రముఖులు శ్రీవారిని దర్శించుకున్నారు,. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామ కృష్ణ రావు, ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులతో పాటు ఆలూరు జై శంకర్, . ధర్మకర్తల మండలి ప్రతినిధులు తదితరులు . పర్యవేక్షించారు, భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఇటు సంక్షేమ పథకాలు... అటు అభివృద్ధి పరుగులు

**2025 లో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వం**

**సూపర్ సిక్స్ పథకాల సూపర్ హిట్ తో 2025లో కూటమి పాలన**

**సుపరిపాలనతో బ్రాండ్ ఇమేజ్...ప్రభుత్వ చొరవతో లక్షల కోట్ల పెట్టుబడులు**

**పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో ఆశలకు నాంది**

**నాడు భూముల కబ్జా... నేడు రాజ ముద్రతో దర్జా**

**సంస్కరణల బాట పట్టిన విద్యా-వైద్య రంగాలు...ఇరిగేషన్ లో మార్పులు**

**అద్భుత వేగంతో అమరావతి... పూర్తి దిశగా పోలవరం**

**2025లో నాయుడు గిరీని పరిచయం చేసిన సీబీఎన్**

**2025లో ఉషోదయం... ఇక 2026లో నవోదయం**

**కొత్త ఏడాదిలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం**

**ప్రజల ఆశలను నెరవేర్చిన 2025.... ఆకాంక్షలు తీర్చేలా 2026**

**అమరావతి, డిసెంబర్ 30:**

2025 ఏడాదిలో కూటమి ప్రభుత్వం అద్భుతమైన విజయాలు సాధించింది. ఎన్నికల్లో ఇచ్చిన మెజార్టీ హామీలను నెరవేర్చింది. చెప్పని అంశాలను ప్రజలకు అందించింది. విభజనను మించిన విధ్వంసాన్ని 2019-2024 మధ్య కాలంలో గత పాలకులు చేశారు...ప్రజలు అనుభవించారు. 2024 ఎన్నికల్లో అద్భుత విజయం తర్వాత ఏర్పాటైన కూటమి ప్రభుత్వానికి తొలి ఆరు నెలలు అస్తవ్యస్తమైన వ్యవస్థలను సరి చేయడానికే కాలం సరిపోయింది. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ప్రవేశ పెట్టలేనంత రీతిలో అన్ని వ్యవస్థలను నాశనం చేసేసింది నాటి వైసీపీ ప్రభుత్వం. దీంతో విభజన తర్వాత రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి నాటి ప్రభుత్వం శ్రమించిన దానికంటే రెండింతలు ఎక్కువగా శ్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత 2025 తొలి నాళ్లల్లో రాష్ట్రంలోని వ్యవస్థలు నెమ్మదిగా గాడిలో పడ్డాయి. అప్పటి నుంచి రాష్ట్రంలో సంక్షేమాన్ని... అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టించింది. కనీ వినీ ఎరుగని రీతిలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే కొన్ని సంక్షేమ పథకాలను ప్రారంభించినా... 2025 సంవత్సరంలో మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన మెజార్టీ హామీలను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. కేంద్రం పూర్తి స్థాయిలో అందిస్తున్న సహకారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహా ప్రభుత్వ యంత్రాంగం అందిపుచ్చుకుంది. వివిధ రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించడంతోపాటు... ప్రభుత్వం తీసుకున్న 23 పాలసీలతో దేశాన్ని ఆకర్షించే స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం అద్భుత పనితీరు కనబరిచింది. ప్రముఖ ఎకనమిక్ టైమ్స్ దినపత్రిక అందించే ప్రతిష్టాత్మక బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025ను అందించింది. రాష్ట్రం ఏ స్థాయిలో అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిందనే విషయాన్ని చెప్పడానికి చంద్రబాబుకు దక్కిన ఈ అవార్డే నిదర్శనం.

**సంక్షేమానికి చిరునామాగా...**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతూనే ఉంది. 2025 ఏడాదిలో కూటమి ప్రభుత్వం చూపించిన ప్రగతి వేరే లెవల్ అని చెప్పాల్సిందే. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసింది. తల్లికి వందనం కింద రూ.10,090 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తల్లుల ఖాతాలో వేసింది. దీని ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం అందింది. ఇక స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది కూటమి ప్రభుత్వం. ఈ ఏడాది ఆగస్ట్ 15వ తేదీ నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తే... ఇప్పటి వరకు 3.25 కోట్ల ప్రయాణాలు చేశారు. ఇప్పటి వరకు ఈ పథకానికి రూ.1,144 కోట్ల మేర ఖర్చు అయింది. ఇక దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఇక అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతులకు మేలు జరిగింది. వారి ఖాతాల్లో రూ.6,310 కోట్లు జమ అయ్యాయి. దీపం%-%2 పథకం కింద ఏడాదికి 3 ఉచిత సిలిండర్లను మహిళలకు ఉచితంగా అందించారు. దీని కోసం రూ.2,684 కోట్లు ఖర్చు పెట్టారు... ఇప్పటికి దాదాపు 2 కోట్ల సిలిండర్ల పంపిణీ చేపట్టారు. ఇక సామాజిక భద్రత ఫించన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు బద్దలు కొట్టుకుంటూ వెళ్తోంది. ఈ పథకం కింద ఇప్పటి వరకు రూ. 50 వేల కోట్లను పంపిణీ చేశారు. అర లక్ష కోట్ల రూపాయల పంపిణీని పూర్తి చేసిన ఘనతను 2025వ సంవత్సరం దక్కించుకుని చరిత్రలో నిలిచిపోయింది. ఇక వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల మేరకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ స్కీంలను అమలు చేసింది కూటమి ప్రభుత్వం. మత్స్యకార భరోసా కింద ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు పంపిణీ చేపట్టింది. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఏడాదికి ఒక్కో లబ్ధిదారుకు రూ.15,000... చొప్పున 2.90 లక్షల మందికి రూ.436 కోట్లు జమ చేసింది కూటమి సర్కార్. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం రూ.51 కోట్లు పంపిణీ చేపట్టారు. అలాగే ఇమామ్‌లకు నెలకు రూ.10,000 మౌజన్లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు ఇచ్చారు. పురోహితులకు నెలకు రూ.15,000 వేతనం, నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000కు వేతనాలను పెంచారు. ఇక జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం ఇస్తున్నారు. ఇవి కాకుండా... వివిధ వర్గాలను ఆదుకునేందుకు వారికి అండగా నిలిచేందుకు మరిన్ని పథకాలను అందుబాటులోకి తెచ్చారు. దీంట్లో భాగంగానే మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ అందించారు. మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, చేనేత మగ్గాలకు 200 యూనిట్ల ఉచితంగా విద్యుత్ అందుతోంది. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపులు జరిగాయి. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ - స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. అలాగే ఈ ఏడాది మైనారిటీ సంక్షేమానికి రూ. 3,670 కోట్లు వ్యయం చేశారు. ఇక గత పాలకులు కనికరం లేకుండా పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను రద్దు చేశారు. వాటిని పునరుద్దరించిన కూటమి ప్రభుత్వం... మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా 204 అన్నా క్యాంటిన్లు ఏర్పాటు చేసి... ఇప్పటి వరకు 4 కోట్ల భోజనాలు పెట్టింది.

**కొలువుల జాతర... ఉద్యోగ నియామకాలు**

ఇక యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామనే హామీలో భాగంగా ప్రభుత్వం తరపున భారీ ఎత్తున ఉద్యోగాల కల్పనకు కూటమి సర్కార్ శ్రీకారం చుట్టడమే కాకుండా... ఎన్నో అడ్డంకులను అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించింది 15491 మందిని టీచర్లుగా రిక్రూట్ చేసింది. ముఖ్యమంత్రి తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీని 2025లో అమలు చేసింది కూటమి సర్కార్. ఇదే కాకుండా... కానిస్టేబుల్ పోస్టుల నియామకాన్ని పూర్తి చేసింది.. 5,757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందచేసింది కూటమి ప్రభుత్వం. అలాగే శిక్షణ పొందే పోలీస్ కానిస్టేబుళ్లకు స్టైఫండ్ ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేసిందీ ఈ సంతవత్సరమే. ఇక గత ప్రభుత్వం వారసత్వంగా అప్పులనే కాదు.. చెత్తను కూడా అందించింది. దాదాపు 84 లక్షల టన్నుల చెత్తను ఎక్కడిదక్కడే వదిలేసి వైసీపీ ప్రభుత్వం గద్దె దిగింది. ఈ చెత్తను పూర్తిగా తొలగించడమే కాకుండా...ఈ చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేసేందుకు డిస్కంలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంది పట్టణాభివృద్ధి శాఖ. ఇక గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వేల కిలో మీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ ఏడాది రోడ్ల మరమ్మత్తుల నిమిత్తం రూ.1,000 కోట్ల కేటాయించింది కూటి సర్కారు. అలాగే మరో రూ.3,000 కోట్లతో రహదారుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**చరిత్రను తిరగరాసేలా పారిశ్రామికాభివృద్ధి**

ఇక 2025 ఏడాదిలో ఏపీలో పారిశ్రామిక రంగం పరుగులు పెట్టింది... చరిత్రను తిరగరాసే దిశగా అడుగులు వేసింది. ముఖ్యంగా ఐటీ, ఏఐ డేటా సెంటర్ తదితర రంగాల్లో కీలక పెట్టుబడులు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రాష్ట్రానికి మైక్రో సాఫ్ట్ తెచ్చి చంద్రబాబు అభివృద్ధికి బాటలు వేశారు. దాన్ని మరోసారి గుర్తుకు తెచ్చేలా ఈ ఏడాది విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ వచ్చింది. ఈ కలను సాకారం చేసే విషయంలో మంత్రి నారా లోకేష్ కీలక భూమిక పోషించారు. ఇవే కాకుండా... కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక ఐటీ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేలా మొత్తంగా 23 కొత్త పాలసీలను రూపొందించింది కూటమి ప్రభుత్వం. అలాగే పరిశ్రమలకు రాయితీల కోసం ఎస్క్రో ఖాతాలు తెరవాలనే నిర్ణయం తీసుకున్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల నిమిత్తం ఎస్క్రో ఖాతాలు తెరిచే తొలి రాష్ట్రంగా ఏపీ చరిత్రలో నిలిచిపోయింది. ఇక విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ ది మరో చరిత్ర అనే చెప్పాలి. ఈ సదస్సులో 610 ఒప్పందాలు. రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలకు రోడ్ మ్యాప్ సిద్ధమైంది. ఇప్పటి వరకూ జరిగిన 13 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.55 పెట్టుబడులు, 8.23 లక్షల ఉద్యోగాలకు ఆమోదం తెలిపింది రాష్ట్ర ప్రభుత్వం. ఇక 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ పాలసీ వంటివి అభివృద్ధి పుంజుకునేందుకు దోహదం చేస్తున్నాయి. ఇక ఈ ఏడాది విశాఖ రూపు రేఖలు మారి... అంతర్జాతీయ స్థాయి నగరంగా ఆవిర్భవించేందుకు బీజాలు పడ్డాయి. విశాఖను ఐటీ హబ్ చేసేలా గూగుల్ %-% రిలయన్స్ డేటా సెంటర్, టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్ కంపెనీల కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయి. విద్య, వైద్యం, రవాణా తదితర రంగాల్లో పరిశోధనలతో పాటు ఇతర అంశాల్లో వినియోగం కోసం ఏర్పాటు అవుతున్న అమరావతి క్వాటం వ్యాలీకి ఈ ఏడాదే అడుగులు పడ్డాయి. రూ. 50 వేల కోట్లకు పైగా వ్యయంతో అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. ఈ స్థాయిలో కీలక నిర్ణయాలు తీసుకోవడం...స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పారిశ్రామిక రంగానికి అనుకూలంగా పాలసీలు తీసుకురావడంతో సీఎం చంద్రబాబును ప్రతిష్టాత్మక ఎకనమిక్ టైమ్స్ అందించే బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు వరించింది. నాయుడు గిరీ అంటే ఏంటో సీఎం చంద్రబాబు చూపించారు. 2025లో కూటమి పనితీరు ఎంత అద్భుతంగా ఉందోనని చెప్పడానికి చంద్రబాబుకు వచ్చిన అవార్డే నిలువెత్తు నిదర్శనం.

ప్రక్షాళన చేశారు... పరుగులు పెట్టిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి మెజార్టీ వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. విద్యా వైద్య రంగాలు కుదేలయ్యాయి. ఇక దేవదాయ శాఖ, టీటీడీ వంటి వ్యవస్థలు అపవిత్రం చేసేలా గత ప్రభుత్వం వ్యవహరించింది. ఇలా అస్తవ్యస్తమైన వ్యవస్థలను...వివిధ శాఖలను ఈ ఏడాది దాదాపు గాడిలో పడ్డాయనే చెప్పాలి. తిరుమల సహా దేవాలయాల సేవల్లో పెనుమార్పులు తెచ్చారు. 15 ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు ప్రారంభించారు. ఇక విశాఖలో యోగాంధ్ర నిర్వహణ ప్రపంచ రికార్డులను సృష్టించింది. విశాఖకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చింది. కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ సక్సెస్ అయింది. అలాగే వైద్య రంగంలో సంస్కరణలు తెస్తూ... పేద వైద్య విద్యార్థులకు అదనంగా 110 వైద్య విద్య సీట్లను అందుబాటులో తెచ్చేలా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది ప్రభుత్వం. ఇక డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కీలక పంచాయతీ రాజ్ వ్యవస్థ గాడిలో పడింది. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో 4,000 కి.మీ. రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే రాష్ట్రమంతటా ఒకే రోజు 13,326 గ్రామ సభల నిర్వహణ, దాదాపు 3 వేల పనులకు శ్రీకారం చుట్టారు... మన గ్రామాల సత్తా చాటేలా ఈ గ్రామ సభలను నిర్వహించడంలో పవన్ కళ్యాణ్ చొరవ చూపారు. ఇక అడవి తల్లి బాట కార్యక్రమంతో గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణంపై పవన్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. శివారు గ్రామాలకు 4జీ నెట్వర్క్ కల్పించే దిశగా పనులు జరుగుతున్నాయి. అలాగే పంచాయతీ రాజ్ వ్యవస్థలో పదోన్నతులు కల్పించారు, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల చేశారు. 95 సీఎస్ఎస్ పథకాల పునరుద్ధరణ చేయడం ద్వారా కేంద్ర నిధులు రాష్ట్రానికి వచ్చేలా వెసులుబాటు కల్పించారు. ఇక రాష్ట్రానికి కుంకీ ఏనుగులు వచ్చాయి. దీంతో పాటు ప్రతీ ఇంటికి అమరజీవి జలధార పేరుతో మంచినీటి కుళాయి కనెక్షన్లు అందించేందుకు రూ.3,050 కోట్లతో ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. 1.21 కోట్ల మంది దాహార్తిని తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుని పవన్ ఈ ప్రాజెక్టుపై ఫోకస్ పెట్టారు. మొత్తంగా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సుతో కూటమి సర్కారు అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది.

**సీమకు జలసిరులు... ధాన్య రాశులు... గృహప్రవేశాలు**

అలాగే 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేపట్టి రికార్డు సృష్టించింది కూటమి ప్రభుత్వం. చెరువులు, ప్రాజెక్టులు నింపి రాయలసీమకు సాగు, తాగునీటిని ప్రభుత్వం అందించింది. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయి. ఇక పోలవరం పనుల్లో పురోగతి పరుగులు పెడుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపులను వేగవంతం చేశారు. వేగంగా వెలిగొండ పనులను ప్రారంభించి... 2026లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే రికార్డ్ స్థాయిలో ధాన్యాన్ని సేకరించారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం సేకరణ డబ్బులను జమ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఖరీఫ్ సీజన్లో 34.23 లక్షల మెట్రిక్ న్నుల ధాన్యం సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం... 5.48 లక్షల మంది రైతులకు రూ.8,120 కోట్లు జమ చేసింది. ఇక మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి సహా పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం అందించింది. ఇలాంటి వివిధ రకాల చర్యల ద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ చేరుకుంది. 11.28 శాతంగా నమోదు చేసుకుంది. అంతే కాకుండా... రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాల్సిన మూల ధన వ్యయం కూడా పెరిగింది. అలాగే రెవెన్యూ రంగంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.. రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రాజ ముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారు. నాలా చట్టం రద్దు చేశారు. ఇళ్లు లేని పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఉచితంగా స్థలం, దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసింది. దీంతో పాటు 3 లక్షల ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించి... లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను ఈ ఏడాదే ప్రభుత్వం అందచేసింది. ఇక గేట్స్ ఫౌండేషన్, టాటా సౌజన్యంతో సంజీవని ప్రాజెక్టు కుప్పంలో పైలెట్ గా ఏర్పాటు చేశారు. ఇది భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలకు ఈ పథకం సంజీవనిగా మారనుంది. అలాగే డిజి హెల్త్ కేర్, యూనివర్సల్ హెల్త్ పాలసీల వంటి వాటితో వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చింది కూటమి ప్రభుత్వం. విద్యా వ్యవస్థలో పెనుమార్పులను తీసుకొచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను విద్యార్థులకు ఎలాంటి రాజకీయ నేతల బొమ్మలు లేకుండా అందచేశారు. ఇక టీచర్ల బదిలీలను పారదర్శకంగా చేపట్టి...ఆదర్శంగా నిలిచింది విద్యా శాఖ. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 75 లక్షల విద్యార్థులకు హెల్త్ చెకప్, విద్యార్థుల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంచేలా 'ముస్తాబు' కార్యక్రమాన్ని చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం.

**ఛార్జీలు తగ్గాయి... నేరాలూ తగ్గాయి..**

గత ప్రభుత్వం పీపీఏల రద్దుతో పూర్తిగా విద్యుత్ వ్యవస్థను నాశనం చేసింది. అలాంటి విద్యుత్ వ్యవస్థ ఈ ఏడాది గాడిన పడింది.

ఉత్తేజిత దినపత్రిక

# స్వర్ణ నారావారిపల్లె -అభివృద్ధికి సంబంధించి త్వరలో

## ప్రారంభించబోవు భవనాలను అభివృద్ధి కార్యక్రమాం



### స్వర్ణ నారావారిపల్లె -అభివృద్ధికి సంబంధించి త్వరలో ప్రారంభించబోవు భవనాలను అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి డిసెంబర్ 30**

: మంగళవారం స్వర్ణ నారావారిపల్లె – అభివృద్ధికి సంబంధించిన త్వరలో ప్రారంభించబోవు భవనాలను, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి మరియు స్వర్ణ నారావారిపల్లి ప్రత్యేక అధికారి శ్రీమతి సుశీలా దేవి తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణ నారావారి పల్లె – అభివృద్ధిలో భాగంగా జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. అనంతరం నారావారిపల్లి అభివృద్ధికి సంబంధించిన పనులను త్వరితగతిన పనులు పూర్తి అయ్యేటట్లు చూడాలని తెలిపారు. పకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్ స్టేషన్, రంగంపేట మోడల్ స్కూలు నిర్మాణం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (50 బెడ్స్) ఈ సంజీవిని ప్రాజెక్టు, టాటా డి ఐ ఎన్ సి, తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. అనంతరం నారావారిపల్లి నందు జరిగిన స్వర్ణ నారావారిపల్లె – అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించి స్కిల్ డెవలప్మెంట్ భవనం,కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన, శ్రీ శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయంనకు వెళ్ళు సి సి రోడ్డు, మూలపల్లి చెరువు, 33/11 కె వి ఇండోర్ సబ్ స్టేషన్ , రంగంపేట మోడల్ స్కూల్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జె డి ప్రసాద్ రావు, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ రవికుమార్,డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్ ఏపీఎంఐపి పిడిచిన్న రెడ్డయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి కెవియన్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్సీ మధుసూదన్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ఆర్. లోకనాథం, ఇరిగేషన్ అధికారులు, ఏ పి ఎస్ పి డి సి ఎల్ అధికారులు,చంద్రగిరి తహసిల్దార్ శివరాం సుబ్బయ్య ,ఎంపీడీవో సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు రాజకీయాల్లో స్పష్టమైన సంకేతం

**2029 వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుట్టా రేణుకమ్మకే ప్రజల మద్దతు**



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు డిసెంబర్ 30 మంగళవారం నియోజకవర్గ రాజకీయాల్లో 2029 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక సంకేతాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు, నాయకత్వ స్థాయిలో వినిపిస్తున్న ఏకస్వర అభిప్రాయం ఒక్కటే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బుట్టా రేణుకమ్మ గారే ఉండాలన్న డిమాండ్ బలంగా ఉద్భవిస్తోంది. నియోజకవర్గంలోనే కాకుండా కర్నూలు జిల్లా వ్యాప్తంగా బుట్టా రేణుకమ్మ గారి నాయకత్వంపై విశ్వాసం మరింత బలపడుతోంది. ప్రజలతో నిరంతర సంబంధం, సమస్యలపై ప్రత్యక్ష స్పందన, సేవా కార్యక్రమాల ద్వారా ఆమె సంపాదించుకున్న ప్రజాదరణే ఈ డిమాండ్‌కు మూలాధారం అన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు కూడా 2029లో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి బలమైన అభ్యర్థిగా బుట్టా రేణుకమ్మ గారే సరైన ఎంపిక అన్న అభిప్రాయంలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అంశం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజల ఆకాంక్ష, పార్టీ అవసరం, నాయకత్వ విశ్వాసం ఈ మూడు అంశాలు ఒకే దిశగా కేంద్రీకృతమవుతుండటంతో, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైసీపీ రాజకీయ వ్యూహం స్పష్టంగా రూపుదిద్దుకుంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2029 ఎన్నికల్లో ఎమ్మిగనూరు రాజకీయ సమీకరణాలు బుట్టా రేణుకమ్మ గారి కేంద్రంగా తిరుగనున్నాయన్న సంకేతాలు ఇప్పటికే బలంగా వినిపిస్తున్నాయి. శ్రీ డి. నజీర్ అహమ్మద్,మునిసిపల్ వైస్ చైర్మన్,నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్,ఎమ్మిగనూరు,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.

## మత్తు పదార్థాల వల్ల యువత విలువైన జీవితం నాశనం.. డా. కె. వేణుగోపాల్, సీఈఓ సెట్కూరు..

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు. డిసెంబర్. 30,**



జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని శ్రీ నంది జూనియర్ కళాశాలలో మంగళవారం “మత్తు పదార్థాల వ్యసనం %-% పర్యవసానాలు, సైబర్ క్రైమ్” అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ డా. కె. వేణుగోపాల్ గారు మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు అలవాటు పడితే యువత తమ విలువైన జీవితాన్ని కోల్పోతారని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు యువతను పెడదారిన పడేయడంలో ముందంజలో ఉన్నాయని, ఇవి సమాజానికి చీడగా మారాయని అన్నారు. మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందని సూచించారు.

సిగరెట్లు, మద్యపానం వంటి అలవాట్లను ఫ్యాషన్‌గా భావించడం ప్రమాదకరమని, ఇవే క్రమంగా డ్రగ్స్‌కు దారి తీస్తాయని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత భవిష్యత్ అంధకారమవుతుందని, మెదడు మొద్దుబారిపోవడం, గుండె, కాలేయం వంటి కీలక అవయవాలు దెబ్బతినడం, రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వంటి తీవ్ర అనర్థాలు సంభవిస్తాయని వివరించారు. కావున యువత డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని పిలుపునిచ్చారు.

జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీ సోమ శివారెడ్డి గారు మాట్లాడుతూ, డ్రగ్స్ లేదా మత్తు పదార్థాలు వినియోగించినా, సరఫరా చేస్తూ దొరికినా కఠిన శిక్షలు విధిస్తారని తెలిపారు. తమ పరిసరాల్లో గంజాయి, కొకైన్, నాటు సారా వంటి మత్తు పదార్థాల సరఫరా లేదా వినియోగం జరిగితే వెంటనే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్రీ డి. శ్యాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ తిరుమల వెంకట సాయి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిది**



ఎమ్మిగనూరు డిసెంబర్ 30 మంగళవారం

– బిలివైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఎమ్మిగనూరు పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న శ్రీ తిరుమల వెంకట సాయి దేవాలయాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి సందర్శించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి దేవుని ఆశీస్సులు పొందారు.

– బిలిఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారు ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల చంద్రశేఖర్ , పట్టణ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు డిసెంబర్ 30 మంగళవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటైన ఎమ్మిగనూరు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, టిప్పర్ యజమానులు ఐక్యంగా పనిచేస్తూ, రవాణా రంగ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. అలాగే, కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపులో అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు.

బిలిఈ కార్యక్రమంలో పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల చంద్రశేఖర్ గారు, టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లవరం గ్రామంలో నాటు సారాయి విక్రయంపై పోలీసుల మెరుపు దాడి..

**10 లీటర్ల నాటు సారాయి స్వాధీనం నిందితుడు రిమాండ్‌కు..**

**నందికొట్కూరు, డిసెంబర్ 30 (ఉత్తేజిత ప్రతినిధి):**



నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పరిధిలోని బొల్లవరం గ్రామంలో అక్రమంగా నాటు సారాయి విక్రయం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు బ్రాహ్మణకొట్కూరు ఎస్సై వి. మణికంఠ మంగళవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో పోలీసు సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు.

ఈ దాడిలో నందికొట్కూరు షికారిపేటకు చెందిన నీలి షికారి సురేష్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానానికి హాజరుపరచగా, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్సై వి. మణికంఠ స్పష్టం చేశారు.

## దృష్టిహీన ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు డిసెంబర్ 30, మంగళవారం పట్టణంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి దృష్టిహీన ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, దృష్టిహీనులు సమాజంలో స్వయం ఆధారంగా ముందుకు సాగుతూ, ప్రతిభతో పాటు కష్టపడి పనిచేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి అభ్యున్నతికి తోడ్పాటుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల చంద్రశేఖర్ దృష్టిహీన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు డిసెంబర్ 30 మంగళవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటైన ఎమ్మిగనూరు టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, టిప్పర్ యజమానులు ఐక్యంగా పనిచేస్తూ, రవాణా రంగ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. అలాగే, కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపులో అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు.

బిలిఈ కార్యక్రమంలో పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల చంద్రశేఖర్ గారు, టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

**బేతంచెర్ల :ఉత్తేజిత ప్రతినిధి :**



మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ గణ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీ దేవి భూదేవి సమేత కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ముందుగా పుష్య శుద్ధ ఏకాదశి మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు అనంతరం భక్తదులకు ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలోభజ భజంత్రీల మధ్య అంగరంగ వైభవంగా కళ్యాణ మండపానికి ఊరేగింపుగా తెచ్చారు. భక్త జనసందోహ మధ్య కళ్యాణ మహోత్సవంలోక కళ్యాణార్థం స్వామి అమ్మవారి కళ్యాణి భక్త జన సందోహం మధ్య ఆలయ వేద పండితులు జ్వాల చక్రవర్తి,కళ్యాణ్ చక్రవర్తి,ఆలయ అర్చక బృందం వైకుంఠ ఏకాదశి విశిష్టత కళ్యాణం యొక్క విశిష్టతను భక్తాదులకు వినిపించారు అనంతరం అభిజిత్ లగ్నశు భపుష్కరాంశమందు శ్రీ స్వామి అమ్మవారి కళ్యాణాన్ని గణపతి పూజ పంచామృత అభిషేకం పుణ్యాహవాచనం విశేష పూజలతో మహా మంగళ హారతులతో కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవారికి ఆలయ ఈవో రామాంజనేయులు,దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అదేవిధంగా కాసపురం ఆంజనేయస్వామి ఉప కమిషనర్ ఈఓ విజయరాజు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పురవీధులలో మంగళ వాయిద్యాల మధ్య చెక్కభజన కోలాటం తో స్వామి అమ్మవార్ల రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

## శ్రీ శైలంలో.యాచకులకు దుప్పట్లు పంపిణీ .సిఐటియు..

**ఉత్తేజిత (శ్రీశైలం ప్రతినిధి )**



డిసెంబర్ 30వ తేదీ మంగళవారం రోజున సిఐటియు. హమలి వర్కర్స్. సిఐటియు జిల్లా నాయకులు. మునిపాటి చిన్న మారెన్న. సిఐటియు జిల్లా. కౌన్సిల్ సభ్యులు.. మేండం మల్లికార్జున. అద్వర్యం లో. శ్రీ శైల భ్రమరాంబ. మల్లికార్జున స్వామి. శ్రీశైల దేవస్థానంలో. యచకులకు. సాదులకు. దుప్పట్లు పంపిణీ. చేశారు. ఈ కార్యక్రమంలో నాగ వెంకటేశ్వర్లు .పి. నాగేశ్వరరావు బి. వెంకటస్వామి. రంగస్వామి. ఆవులయ్య. ముగెన్న. నారాయణ. పెద్ద గంగులు. హనుమంతరెడ్డి. చిన్న గంగులు. పవన్ రెడ్డి. బీమలింగడు. తెలుగు. మల్లయ్య. పాల్గొన్నారు.

## శ్లోక స్కూల్లో భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ డిసెంబర్ 30 :**




నందికొట్కూరు పట్టణంలోని శ్లోకా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వైకుంఠ ఏకాదశి విశిష్టతను చాటే కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్లు కవిత, శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యతను వివరించే ప్రసంగాలు, భక్తిగీతాలు ప్రదర్శించారు. ప్రత్యేక కార్యక్రమాలతో వేడుకను మరింత ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# విశాఖ నగరపాలక సంస్థలో పది జోన్లు

విశాఖపట్టణం: మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో పునర్వ్యవస్థీకరించిన 10 జోనల్ కార్యాలయాల్లో జనవరి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మార్పులకు అనుగుణంగా జోనల్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. జీవీఎంసీ పరిధిలో జోనల్ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని.. అందుకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 8 జోన్లను 10కి పెంచినట్లు కమిషనర్ పేర్కొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 10 జోనల్ కార్యాలయాలు పనిచేయాలని, అందుకు సంబంధించిన ఫైల్స్, రికార్డులు తారుమారు కాకుండా ఒక క్రమ పద్ధతిలో ఆయా జోన్లకు తీసుకువెళ్లాలన్నారు. ఇకపై సిబ్బంది, అధికారులు ఆయా జోనల్ కార్యాలయాల నుంచే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్లను ఆదేశించారు. ఆయా జోనల్ కార్యాలయాల పరిధిలో ఉన్న వార్డులు, సచివాలయాలు ప్రజలకు తెలిసే విధంగా సచివాలయాల వారీగా వార్డు కార్యదర్శులు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్లు, అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇకపై జీవీఎంసీ కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాలు, సేవలు ఆయా జోనల్ కార్యాలయాల ద్వారా పొందాలని కమిషనర్ తెలిపారు.

## మరో ముగ్గురు సలహాదారులు
# నియామకం

**మంతెన, కార్టూనిస్ట్ శ్రీధర్, సీతారామాంజనేయప్రసాద్**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురిని సలహాదారులుగా నియమించింది. ప్రముఖ ప్రకృతి వైద్య రంగ నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజును ఏపీ ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది. డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా ఎంతో మందికి సేవలు అందించారు. ఉండవల్లి కరకట్టపై ప్రకృతి చికిత్సాలయం పేరుతో ఆసుపత్రి ఏర్పాటు చేశారు. విజయవాడ, నరసాపురంలోనూ ఆరోగ్యాలయం కేంద్రాలున్నాయి. పోచంపల్లి శ్రీధర్‌రావును ప్రభుత్వం సలహాదారుగా నియమించింది. కార్టూనిస్ట్ శ్రీధర్‌గా సుపరిచితులైన ఆయన మాస్ కమ్యూనికేషన్స్‌లో సేవలు అందిస్తారు. దేవదాయశాఖ సలహాదారుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. మంతెన, శ్రీధర్, సీతారామాంజనేయ ప్రసాద్ తమ పదవుల్లో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. మాస్ కమ్యూనికేషన్ ప్రభుత్వ సలహాదారు నియామకంపై జీవో తొలుత తప్పుగా జారీ అయింది. గంటల వ్యవధిలో తప్పును సరి చేసిన జీఏడీ మరో జీవోను జారీ చేసింది. సరిచేసిన జీవోలో దేవదాయ శాఖ సలహాదారులుగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ నియమితులయ్యారు. తొలుత జారీ చేసిన జీవోలో ఆయన్ను మాస్ కమ్యూనికేషన్స్‌కు సలహాదారుగా పేర్కొనడం గమనార్హం.

## పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా రోష్ని అపరాంజి

విశాఖపట్టణం: విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా మహిళా ఐఏఎస్ అధికారి రోష్ని అపరాంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ పోర్టులో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారి కావడం విశేషం. విశాఖ పోర్టు అథారిటీకి డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులవడానికి ముందు డిప్యుటేషన్‌పై విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2018లో ప్రజా పరిపాలనలో విశిష్ట సేవలకుగాను ప్రధాని అవార్డు సహా అనేక పురస్కారాలు అందుకున్నారు. అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్టు హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు కుమార్తె డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఏప్రిల్ 3, 1984లో జన్మించిన రోష్ని.. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఆమెకు విస్తృత పరిపాలనా అనుభవం ఉంది. అస్సాంలోని జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అదే జిల్లాకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా సేవలందించారు.

## ఏ వలువల విలువలు తెలుసుకోండి

గజ్వేల్: ఇంటి నుండి క్రమశిక్షణ మొదలవుతుంది. బాల్యంలో తల్లి మార్గదర్శి. ఆమె ఏం చెప్పినా పిల్లలు తప్పకుండా పాటిస్తుంటారు. ఆ తర్వాత తండ్రి పాలనలో పిల్లలు ఎన్నో నేర్చుకుం టున్నారు. ఇది మన భారతీయ సంస్కృతి. విద్య, వినయం, వస్త్రధారణ ఇవన్నీ ముందుగా తల్లి ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. ముఖ్యంగా పిల్లలు తల్లిని గమనిస్తుంటారు. ఆమె కట్టు బొట్టును ఇష్టపడతారు. ఏమరు పాటులో ఎప్పుడైనా తల్లి ముఖంలో బొట్టు కనబడకపోతే చిన్నారి చేతులతో బొట్టు తెచ్చి పెడతారు. ఇది అందరికీ అనుభవమే. చీర కొంగు కాస్త పక్కకు జరిగితే, ఆ బిడ్డడు ముఖ్యంగా మగ పిల్లవాడు తల్లి కొంగు సరి చేస్తాడు. వాడికి తెలియకుండానే తల్లి బాగుండాలి అని కోరుకుంటాడు. ఇవన్నీ ఏ రాజ్యాంగం లోనూ రాసి ఉండవు. కాలక్రమేణా నేర్చుకుంటున్నాము. అనాదిగా ఆకులు కట్టుకున్న మనిషి మెల్లమెల్లగా

వస్త్రాలను ధరించడం ఎలా నేర్చుకున్నాడో ,అలాగే నెమ్మదిగా ఈ తరంలో కొందరు ముందుకు వెళ్లకుండా మళ్లీ ఆదిమానవుడి వైపు వెళ్ళిపోతున్నారు. స్వేచ్ఛ అనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదు. మనకి మనం నియంత్రించుకునేది. 'నీ ఇష్టం వచ్చినట్లుగా ఉండు' అని చెప్తే, పరిమితులు దాటి ఉండమని చెప్పడం కాదు. నువ్వు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి అని అర్థం. నీ శరీరాన్ని నలుగురిలోకి వెళ్ళినప్పుడు ఎలాంటి దుస్తులతో అలంకరించుకోవాలి అనేది ఆలోచించుకోవాలి. నలుగురిలోకి వెళితే నీకు నచ్చిన బట్టలు కాదు కట్టు కోవాల్సింది. ఏ వలువ ధరిస్తే విలువ పెరుగుతుందో అది ఆలోచించు కోవాలి. అలాగని చీరలే కట్టుకోవాలి అనే సిద్ధాంతం ఎక్కడా లేదు. నిండుగా ఉన్న ఏ వస్త్ర ధారణ ఏదైనా స్త్రీకి అందమే! ఇంట్లో తల్లిదండ్రులకు కూడా పిల్లల వస్త్రధారణ గురించి చెప్పే హక్కు లేదు అనడం ఎంతవరకు సబబు? రేపు ఆ పిల్లలు ఏ విధంగానైనా నష్టపోతే తల్లిదండ్రులకే కదా బాధ కలిగేది. ఇలా మాట్లాడిన వాళ్లు వచ్చి రక్షణ కల్పిస్తారా? కొందరు వితండ వాదనలు చేస్తారు. ఎన్నో ఆకృత్యాలు పిల్లలు వృద్ధుల మీద జరుగుతున్నాయి. మరి వాళ్లే దుస్తులు ధరించారని? అని. దానిని ఈ విషయంతో ముడి పెట్టవద్దు.

# కెసిఆర్ మాటలకు చింతకాయలు రాలేనా ?



మాటలకు చింతకాయలు రాలుతాయా అంటే..రాలుతయానే అంటారు మాజీ సిఎం కెసిఆర్. ఎందుకంటే ఆయన మాటలతోనే పదేళ్లపాటు ఓట్లు రాల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగానికి సిద్ధం అవుతు న్నారు. రెండేళ్లుగా ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగం లోకి దిగబోతున్నట్టు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇంతకాలం విపక్షనేతగా ఆయన విఫలం అయ్యారు. తోలు తీయడానికి ముందు గత 9 ఏళ్ల పాపాల గురించి ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేది. ధరణి,ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు, ఇ- కార్ రేసింగ్ తదిరఅ వినతి కేసులు చాలానే ఉన్నాయి. వీటికి సమాధానం చెప్పడం లేదు. పైగా కెసిఆర్ కొడుకు లొట్టపీసు కేసులని బెదిరింపులకు దిగారు. ఏతావాతా రాజకీయ నేతల భాష జుగుప్సాకరంగా మారింది. ఉన్నట్టుండి తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కేవలం రాజకీయంగా మళ్లీ పట్టు సాధించేందుకే తప్ప మరోటి కాదు. మళ్లీ నీళ్లు,నిధులు, నియామకాలు అంటూ నినదిస్తానని ప్రకటించినట్లు సమాచారం. తెలంగాణ ఏర్పడి పన్నెండేళ్ల తరవాత ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకునే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలి. తెలంగాణపై బీఆర్ఎస్‌కు మాత్రమే పెటెంట్ ఉన్నట్లుగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. తమ హయాంలో పదేళ్ల మోసాలపై మాత్రం మాట్లాడడం లేదు. ఇదంతా కేవలం రాజకీయ డ్రామా అని మాత్రం ప్రజలకు కూడా తెలుసు. వరుస ఓటములతో బిఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు, పంచాయితీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. దీంతో ఇక కెటిఆర్‌తో లాభం లేదనుకున్నాడేమో ..కెసిఆర్ స్వయంగా రంగంలోకి దిగుతానని ప్రకటించారు. గతకొంతకాలంగా బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు ఇదే ప్రకటిస్తూ వస్తున్నారు. మరోవైపు కూతురు కవిత జనంజాగృతి బాటతో బిఆర్ఎస్ నాటి పాలనా వైఫల్యాలను తూర్పారాబడుతున్నారు. ఆనాడు జరిగిన తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. అభివృద్ధి, బంగారు తెలంగాణ పేరుతో జరిగిన ప్రచారమంతా డొల్ల అని ఆమె కళ్లముందే కనిపిస్తుంటే.. వలపోస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుకంటూ వచ్చారు. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికార కోల్పోయాక జరిగిన తర్వాత వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో సిఎం రేవంత్ రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో కెసిఆర్‌పై విరుచుకు పడుతున్నారు. అసెంబ్లీకి రా తేల్చుకుందామని, చర్చిద్దామని సవాళ్లు విసరుతున్నారు. ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే బాగండ దనో ఏమో కెసిఆర్ ..సై అంటూ సవాళ్లు విసిరారు. అందుకే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కయి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కెసిఆర్‌కు అలవాటుగా మారింది. 2018లో చంద్రబాబును బూచిగా చూపించి బొడ్లో కత్తిపెటుటుకుని తిరుగుతున్నాడని ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రచారం ఫలించి రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో అది పనిచేయలేదు. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్

జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పల్లవితో సభలు పెట్టేందుకు సిద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి అయినందున ఆయన తన సొంత జిల్లాకు అన్యాయం చేసుకుంటారని ఎవ్వరు కూడా అనుకోరు. చంద్రబాబుతో కుమ్మక్కు అవుతారనడానికి ఆధారాలు లేవు. ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేస్తారని అనుకోవడానికి లేదు. అందులోనూ కెసిఆర్‌ను ఇక అధికారంలోకి రానివ్వనని శపథం కూడా చేశారు. పాలమూరు రంగారెడ్డిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అందుకేనేమో కెసిఆర్ కూడా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. నీటి అంశాలపై ప్రజలు వెంటన స్పందిస్తారి అనుకుని ఉంటారు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది. ఉంది. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేసారు. నిజానికి తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకనే రెండేళ్లుగా ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. అసెంబ్లీకి కూడా రాకుండా పోయారు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కెసిఆర్ సహా బిఆర్ఎస్ శ్రేణులకు ఇప్పటికీ మింగుడు పడడం లేదు. దీనికితోడు సొంతంగా వ్యూహాలతో కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తున్నారు. రాజకీయంగా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి కెసిఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారని అనుకుంటే అలా జరగడం లేదు. అందుకే ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారం లోకి వచ్చారని ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉంటాయని ఇంకా కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే కృష్ణాజలాల పేరుతో రాజకీయానికి పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో అతిశయంతో పనిచేస్తే ఓటమి తప్పదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులుగా విస్మరించారు. ఇప్పుడు ప్రజలకోసం అని బయలుదేరితే ప్రజలు నమ్ముతారని అనుకోవడం కెసిఆర్ మూర్ఖత్వమే అవుతుంది.

# ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రం

**వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచే రోజు**

**30న ముక్కోటి ఏకాదశి పర్వదినం**



తిరుమల: ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం దగ్గర భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని విశ్వాసం ఉంది. ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. అటు తర్వాత జపం, ధ్యానం. విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకంగా ఉన్నా మహావిష్ణువు వారి కోసం తన వైకుంఠ ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుచేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరుపతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణువు శరణువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును ముర సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం

కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చిని జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం. ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వకు భోజనం రుచి తెలుస్తుంది. గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు.

# హెచ్-1 వీసాలపై కక్ష సాధింపు ధోరణి

**అధికాంలోకి వచ్చిన ఏడాదిగా బెదిరింపులు**

**ట్రంప్ తీరుపై ఇంటాబయటా విమర్శలు**


న్యూఢిల్లీ: వీసా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. భారత విదేశాంగశాఖ అమెరికాతో సంప్రదింపులు జరిపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇదంతా కేవలం భారత్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిగానే గుర్తించాలి. ప్రజలు ఇబ్బంది పడుతున్నా, టెక్ కంపెనీలు సూచించినా ట్రంప్ వైఖరిలో మార్పు రాలేదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత్‌కు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు అన్ని రకాలుగా భారత్‌ను కష్టాల్లో పడేశాయి. హెచ్ 1 బీ వీసాల పీజు భారీగా పెంచేశారు. హెచ్ 1బీ వీసా ఫీజులను ఏడాదికి 1,00,000 డాలర్లు వరకు పెంచారు. హెచ్ 1బీ వీసాల రుసుము పెంచిన కొన్ని రోజులకు మరో దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ చిత్రాలపై ఏకంగా 100 శాతం టారీఫ్‌లు విధించారు. అమెరికాలో భారతీయ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో భారత చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇంతటితో ట్రంప్ కక్ష సాధింపు చర్యలు ఆగలేదు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి

అయ్యే బియ్యంపై 50 శాతం టారీఫ్‌లు విధించారు. ఒకరకంగా చెప్పాలంటే 2025లో భారత్, అమెరికాల మధ్య సంబంధం టారీఫ్‌ల వివాదంతోటే గడిచిపోయింది. అవకాశం ఉన్న ప్రతీ దానిపై ట్రంప్ టారీఫ్‌లు వేసేశారు. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కోపంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కారణంతో ఆగస్టు నెలలో భారత్‌పై ఏకంగా 50 శాతం టారీఫ్‌లు వేశారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. రష్యాతో ఇండియా ఆయిల్ కొనుగోలు చేయటం ఇష్టం లేని ట్రంప్ బెదిరింపులకు దిగారు. రష్యాతో వ్యాపారం మానుకోకపోతే మరిన్ని టారీఫ్‌లు వేస్తామని హెచ్చరింరు. ఇలాంటి సమయంలో గత ఆగస్టు నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడ మోదీ, పుతిన్, జిన్ పింగ్ కలిశారు. పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కలవటంపై ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో సెప్టెంబర్ 5వ తేదీన క్రిప్టిక్ మెసేజ్ పెట్టారు. డిసెంబర్ 8వ తేదీన అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ అమెరికాలోని రైతులకోసం మల్టీ బిలియన్ డాలర్ రిలీఫ్ ప్యాకేజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్, ఇతర ఆసియా దేశాలనుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై విమర్శలు సైతం గుప్పించారు. ఇతర దేశాలనుంచి వస్తువుల్ని అమెరికాలోకి దిగుమతి చేసుకోవటం స్థానిక ఉత్పత్తిదారులకు సవాలుగా మారిందని అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను రక్షించటం కోసం, దిగుమతులకు అడ్డుకట్ట వేయటం కోసం భారీ మొత్తంలో టారిఫ్‌లు వేస్తామని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఎంతో అవసరమైన జాతీయ ఆస్థి. అమెరికాకు వెన్నెముక లాంటి వారని అన్నారు. రష్యా, చైనాలను తమ దారిలోకి తెచ్చుకోవడానికి భారత్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని అమెరికాకు చెందిన

రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ట్రంప్ తీసుకునే నిర్ణయాల వల్ల అమెరికాకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే సంబంధాలు మరింత దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. అయితే, రెండు దేశాల మధ్య భవిష్యత్ వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. 2026లో అయినా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అమెరికన్లు కూడా ఆశగా ఉన్నారు.

## ద్వారకా తిరుమలలో ఏకాదశి ఏర్పాట్లు

**వేకువజామున 5గంటల నుంచే ఉత్తరద్వార దర్శనం**



ఏలూరు: ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం అవుతుంది. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనాన్ని చేసుకుంటారు. ద్వారకా తిరుమలకు ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలి రానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు కూడా వచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది స్వామివారి గిరిప్రదక్షిణ, నిజరూప దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. స్వామివారి గిరి ప్రదక్షిణ ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుంది. ఆలయ మొదటి మెట్టు వద్ద నుంచి ఈ ప్రదక్షిణ మొదలుకానుంది. గిరి ప్రదక్షిణ ఆలయం నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకు కొనసాగుతుంది. గిరి ప్రదక్షిణ నేపథ్యంలో భక్తులు స్వామి వారి ఆలయం చుట్టూ పాదయాత్ర చేస్తారు. ఆలయంలో స్వామి వారి నిజరూప దర్శనం ఈనెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉండనుంది. ఈ క్రమంలో భక్తులు స్వామి వారి పూజా అర్చనలో పాల్గొని నిజరూపాన్ని ప్రత్యక్షంగా దర్శించుకునే అవకాశాన్ని ఆలయ అధికారులు కల్పిస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఇన్వెస్టర్లకు గుడ్‌న్యూస్..




మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్‌న్యూస్. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలే కీలక నిర్ణయం తీసుకుంది. మ్యూచువల్ ఫండ్స్ రికరింగ్ పేమెంట్స్ కోసం ఆటో డెబిట్ లిమిట్‌ను రూ.1 లక్షకు పెంచింది. దీంతో ఎలాంటి ఓటీపీ అథెంటికేషన్ లేకుండానే బ్యాంక్ అకౌంట్ నుంచి పేమెంట్స్ చేయొచ్చు. ఆ వివరాలు తెలుసుకుందాం.

మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లు ఇకపై ఇ-మ్యాండెట్స్ ద్వారా అధిక మొత్తంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథెంటికేషన్ అవసరం లేకుండానే ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్కువ మొత్తం ఇన్వెస్ట్ చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అవకాశం కల్పిస్తోంది. ఇది ఫండ్స్ ఇన్వెస్టర్లకు మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు. ఈ మేరకు ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో తీసుకున్న వివిధ నిర్ణయాలను గత శుక్రవారం ప్రకటించారు గవర్నర్ శక్తికాంత దాస్. ఈ సందర్భంగా మ్యూచువల్ ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్, ఇన్సూరెన్స్ ప్రీమియం పేమెంట్, క్రెడిట్ కార్డు బిల్స్ పేమెంట్స్ వంటి కేటగిరీలకు చేసే ఆటో డెబిట్ రికరింగ్ పేమెంట్లలో ఏఎఫ్ఏ అవసరం లేకుండానే చేసే పేమెంట్ల పరిమితిని రూ.1 లక్షకు పెంచుతున్నట్లు తెలిపారు.
గత శుక్రవారం మానీటరీ పాలసీ కమిటీలోని నిర్ణయాలను వెల్లడించారు గవర్నర్ శక్తికాంత దాస్. కీలక పాలసీ రేటు రెపో రేటును యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇది వరుసగా ఐదోసారి వడ్డీ రేట్లను మార్చకుండా కొనసాగించడం. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు పెంచలేదు. ఈ సందర్భంగానే రికరింగ్ ట్రాన్సాక్షన్ల ఇ-మ్యాండెట్ అంశంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కస్టమర్ల సౌలభ్యం కోసం డిజిటల్ ట్రాన్సాక్షన్ల సెక్యూరిటీ, భద్రతను ఆలోచించి రికరింగ్ ట్రాన్సాక్షన్లకు ఇ-మ్యాండెట్ ప్రాసెస్‌ను ఆగస్టు 2019లో తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ప్రస్తుతం అడిషనల్ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఏఎఫ్ఏ లేకుండా రూ.15 వేల వరకు చేయొచ్చు. దానిని దాటితే ఓటీపీ అథెంటికేషన్ అవసరమయ్యేది. అందుకు ముందు జూన్ 2022లో దీనిని అప్డేట్ చేసింది ఆర్‌బీఐ. ప్రస్తుతం నెలకు ఇ-మ్యాండేట్స్ అనేవి 8.5 కోట్లుగా నమోదవుతున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. వాటి విలువ సుమారు రూ.2,800 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. ప్రస్తుతం వ్యవస్థ అనేది స్థిరంగా ఉందని, మ్యూచువల్ ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం, క్రెడిట్ కార్డు బిల్ పేమెంట్స్ లకు సంబంధించిన ట్రాన్సాక్షన్ల సైతం అనేది రూ. 15 వేలకుపైగా జరుగుతున్నట్లు ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో ఈ లిమిట్‌ను పెంచాల్సిన అవసరం ఉందని గుర్తించి రూ.1 లక్షకు పెంచినట్లు గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు.

# టాటా కంపెనీ మరో ఝలక్..




టాటా మోటార్స్ మరో కీలక ప్రకటన చేసింది. ఇప్పటికే కార్ల ధరలు పెంచుతున్నామని ప్రకటించిన టాటా కంపెనీ లారీలు, ట్రక్కుల వంటి కమర్షియల్ వాహనాల ధరలనూ పెంచనున్నట్లు తెలిపింది. వాణిజ్య వాహనాల ధరలు భారీగా పెరగనున్నాయి. జనవరి నుంచే కొత్త రేట్లు అమలులోకి వస్తాయి. కొత్త ఏడాది ప్రారంభం నుంచి తమ కార్ల ధరలు పెంచుతున్నట్లు దాదాపు అన్ని కంపెనీలు ప్రకటించాయి. అందులో టాటా గ్రూప్ సంస్థ టాటా మోటార్స్ సైతం ఉంది. జనవరి నుంచి కార్ల ధరలను పెంచుతామని ప్రకటించింది. తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. కార్ల ధరల పెంపుతో పాటు తమ సంస్థ నుంచి వస్తోన్న కమర్షియల్ వాహనాల ధరలను సైతం పెంచుతామని వెల్లడించింది. అంటే లారీలు, ట్రక్కుల వంటి వాణిజ్య వాహనాలూ మరింత ప్రియం కానున్నాయి. కార్లతో పాటే వాణిజ్య వాహనాల ధరల పెంపు సైతం వచ్చే ఏడాది జనవరి 1, 2024 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ పేర్కొంది. మోడల్‌ను బట్టి పెంపు 3 శాతం వరకు ఉంటుందని తెలిపింది. అంటే ఒక్కసారిగా భారీగా ధరలు పెరగనున్నాయని చెప్పుకోవచ్చు. ఈ మేరకు డిసెంబర్ 10, 2023 రోజున వెల్లడించింది టాటా మోటార్స్. అలాగే ధరల పెరుగుదల గత తయారీ ఖర్చుల పెరుగుదలతో ఏర్పడిన నష్టాన్ని భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది కంపెనీ. ఈ ధరల పెంపు అనేది వాణిజ్య వాహనాల్లోని అన్ని మోడళ్లకు వర్తిస్తుందని వెల్లడించింది.
టాటా మోటార్స్ వివిధ మోడళ్ల ప్రయాణికుల వాహనాలను విక్రయిస్తోంది. అందులో హ్యాచ్‌బ్యాక్ టియాగో నుంచి ప్రీమియం ఎస్‌యూవీల వరకు ఉన్నాయి. వాటి ధర రూ. 5. 6 లక్షల నుంచి రూ. 25. 94 లక్షల వరకు ఉంది. అయితే, వచ్చే జనవరి నుంచి ఈ ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హొండా, ఆడీ, హ్యూందాయ్ ఇండియా కంపెనీలు కార్ల ధరల పెంపు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టాటా మోటార్స్ షేర్లు బీఎస్ఈలో డిసెంబర్ 8వ తేదీన 1 శాతం మేర పడిపోయి రూ.714. 65 వద్ద స్థిరపడ్డాయి.

# 20 రూపాయలతో రూ.2 లక్షల ప్రమాద బీమా..

మీ బ్యాంక్ ఖాతాలో ఒక 20 రూపాయలు ఉంటే చాలు రూ. 2 లక్షల ప్రమాద బీమా పొందవచ్చు. ఏదైనా అనుకోని ప్రమాదాలు సంభవించి మరణించినా లేదా వైకల్యం సంభవించినా ఆపద వేళల అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకం తీసుకొచ్చింది. ఈ పథకంలో చేరడం ఎలా? బీమా ఎలా పొందాలి అనేది తెలుసుకుందాం.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ద్వారా సామాన్యులకు ప్రమాద బీమా సౌకర్యం అందుతోంది. పాలసీ తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినా లేకా వైకల్యం పొందినా ఈ స్కీమ్ అండగా ఉంటుంది. దీని కాలపరిమితి ఒక ఏడాది ఉంటుంది. ప్రతి ఏటా పొడిగించుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి ఈ స్కీమ్‌లో చేరొచ్చు. ఇందుకోసం ఏదైనా బ్యాంకులో సేవింగ్స్ ఖాతా తప్పనిసరిగా ఉండాలి. ఒకవేళ మీరు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలను కలిగి ఉంటే, అప్పుడు మీరు ఏదైనా ఒక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరాల్సి ఉంటుంది. ఉమ్మడి ఖాతా విషయంలో పేర్లు ఉన్నవారందరూ ఈ పథకంలో చేరవచ్చు. ఎన్నారైలు కూడా ఈ పథకంలో చేరడానికి అర్హులు. కానీ క్లెయిమ్ చేయాల్సి వచ్చిన సమయంలో లబ్ధిదారుడికి/నామినీకి భారత కరెన్సీలో చెల్లింపు చేస్తారు.

ప్రీమియం ఎంత, ఎలా చెల్లించాలి?

ఈ పథకం ప్రీమియంను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఏడాదికి రూ. 12 నుంచి రూ.20కి పెంచింది. ఈ పేమెంట్లకు ఆటో డెబిట్ ఆప్షన్ అందుబాటులో ఉంది. ప్రతి సంవత్సరం జూన్ 1లోగా మీ బ్యాంకు ఖాతా నుంచి ఆటో డెబిట్ పద్ధతిలో కట్ అవుతూ ఉంటుంది. ఒకవేళ జూన్ 1 తర్వాత ఆటో డెబిట్ పద్ధతి ద్వారా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయినట్లయితే ఆ తేదీ నుంచి బీమా పథకం అమలు అవుతుంది. ప్రతి ఏడాది జూన్ 1లోగా పాలసీని పునరుద్ధరించుకోవలసి ఉంటుంది. ఎవరైనా చందాదారుడు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాల ద్వారా ఈ పథకంలో చేరినట్లైతే, క్లెయిమ్ సమయంలో కేవలం ఒక బ్యాంకు ఖాతాకు మాత్రమే చెల్లిస్తారు.

ప్రధాన్ మంత్రి సురక్షా బీమా యోజన పథకం కింద చందాదారుడు ప్రమాదానికి గురై మరణించినా లేదా శాశ్వతంగా వైకల్యానికి గురైనా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి గురైతే రూ.1 లక్ష పరిహారం చెల్లిస్తారు. ప్రమాదంలో రెండు కళ్లు పూర్తిగా కోల్పోయినా, రెండు చేతులు/కాళ్ళు కోల్పోయినా దానిని శాశ్వత వైకల్యంగా గుర్తిస్తారు. అదే ఒక కాలు లేదా ఒక చెయ్యి కోల్పోయి, కంటి చూపు కోల్పోయినా దానిని పాక్షిక వైకల్యంగా గుర్తిస్తారు. సహజ విపత్తుల కారణంగా జరిగిన ప్రమాదాలు, మరణం లేదా వైకల్యం మాత్రమే ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకం కింద కవర్ అవుతుంది. ఆత్మహత్య చేసుకున్న సందర్భాల్లో ఈ పథకం వర్తించదు.

# రిటైర్మెంట్ తర్వాత నెల నెలా ఆదాయం కావాలా?

సంపాదించే వయసులోనే పదవీ విరమణ గురించి ఆలోచించాలని ఆర్థిక నిపుణులు చెబుతుంటారు. ఇప్పటి నుంచి మంచి ప్రణాళికతో పెట్టుబడి పెడితే రిటైర్మెంట్ తర్వాత నెల నెలా గ్యారెంటీ రిటర్న్ పొందవచ్చు. అందుకు ఏం చేయాలి? ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి అనేది తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. మన దేశ జనాభాలో ఎక్కువ శాతం యువత ఉన్నారు. కానీ ఒక ఇరవై, ముప్పై ఏళ్ల తర్వాత ఇప్పుడు యువతరంలో ఉన్న వారంతా రిటైర్‌మెంట్ వయసుకు చేరుకుంటారు. అప్పటి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా వారంతా ఒక బలమైన రిటైర్‌మెంట్ ప్లాన్ తయారు చేసుకోవడం చాలా అవసరం. నెల నెలా గ్యారెంటీ రిటర్న్స్ వచ్చేలా ప్లాన్ చేసుకుంటే ఆర్థిక భద్రతా ఉంటుంది. అయితే.. ఇప్పటి నుంచే పదవీ విరమణ గురించి ఆలోచించడం ఎందుకు అనే భావనలో చాలా మంది ఉంటారు. ఈ అవగాహన లేమి వెనుక రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మన ముందు తరం వాళ్లు చాలా మంది పెన్షన్ వచ్చే ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్ కావడం, అలాగే ప్రస్తుతం మన జనాభాలో ఎక్కువమంది యువత ఉండటంగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా రిటైర్‌మెంట్ ప్లాన్ విషయంలో రెండు అంశాలు బేరీజు వేసుకోవాలి. మనకు అవసరమైన రిటైర్‌మెంట్ ఫండ్ మొత్తం ఎంత ఉండాలి? ఆ మొత్తం సమకూరడానికి ఎలాంటి మదుపు చేయాలి? అనేది చాలా ముఖ్యం. రిటైర్‌మెంట్ ఫండ్ అనే విషయంలో 4 శాతం మాత్రమే ఖర్చులకు



తీసుకోవడం అనే సూత్రం చాలా ప్రాచుర్యం పొందింది. చాలా సరళమైన ఈ విధానం 90లలో విలియం బెంజెన్ అనే ఫైనాన్షియల్ ప్లానర్ ప్రతిపాదించారు. ఈ సూత్రం ప్రకారం రిటైర్‌మెంట్ తర్వాత ప్రతీ ఏడాది పోగు చేసుకున్న ఫండ్ నుంచీ 4 శాతం తమ ఖర్చులకు తీసుకోవాలి. బెంజెన్ ప్రకారం ఇలా చేయడం వల్ల రిటర్మెంట్ తర్వాత కనీసం 33 సంవత్సరాల పాటూ ఉండే అవసరాలకు మనం పోగు చేసుకున్న ఫండ్ సరిపోతుంది. ఈ సూత్రం ప్రకారం ప్రస్తుతం నెల అవసరాలకు రూ.25 వేలు ఖర్చు పెట్టుకుంటున్న కుటుంబం ఇరవై ఏళ్ల తర్వాత ఇదే రకమైన జీవన శైలిని కొనసాగించాలంటే రూ.2.40 కోట్లు కావాల్సి వస్తుంది. రిటైర్‌మెంట్ ఫండ్ మొత్తం ఎంత ఉండాలి అనే విషయం మీద స్పష్టత వచ్చాక, ఆ మొత్తం సమకూర్చుకోవడానికి ఎలాంటి మార్గాల్లో ఎంత మదుపు చేయాలో అర్థం చేసుకోవాలి. నెల జీతం మీద ఆధారపడ్డ ఉద్యోగులు ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ పెన్షన్ స్కీం, మ్యూచువల్ ఫండ్స్ వంటివి పరిశీలించవచ్చు. రిటైర్మెంట్ ఫండ్ ఏర్పరచుకోవడానికి కాస్త రిస్క్ తీసుకునే ఉద్యోగులకు మ్యూచువల్ ఫండ్స్ సరైన మార్గంగా చెప్పుకోవచ్చు. ఈపీఎఫ్, ఎన్‌పీఎస్ లాంటి స్కీములతో పోలిస్తే కొంతం రిస్క్ ఉంటుంది. అయితే, దీర్ఘకాలం పాటు మదుపు చేస్తారు కాబట్టి రిస్క్ అంతగా ఏర్పడదు. 15 ఏళ్లు ఆ పైన మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ చేస్తే ఎలాంటి రిస్క్ ఇబ్బంది పెట్టదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణతో దీనిని అర్థం చేసుకుందాం. నెలకు రూ.20 వేల చొప్పున ఇన్వెస్ట్ చేస్తున్నారు అనుకుందా వారు 20 ఏళ్ల పాటు మదుపు చేస్తే సగటున 18 శాతం రాబడి వస్తుందని అనుకుంటే వారి కార్పస్ రూ.2 కోట్ల 30 లక్షల పైన అవుతుంది. అయితే, ఈ స్థాయిలో రాబడి కష్టమే. కానీ, 12 నుంచి 15 శాతం ఇస్తున్న ఫండ్స్ చాలా ఉన్నాయి. వాటిల్లో ఇన్వెస్ట్ చేయడం మంచిది.

# 2019లో టికెట్టే ఇవ్వలేదు.. ఈసారి ఏకంగా సీఎం పోస్ట్..

ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎం ప్రస్థానం
ఛత్తీస్‌గఢ్ కొత్త ముఖ్యమంత్రిగా గిరిజన నాయకుడు విష్ణుదేవ్ సాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బీజేపీ శాసనసభా పక్షనేతగా విష్ణుదేవ్ సాయ్‌ను బీజేపీ అధిష్టానం ఎంపికచేసింది. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన విష్ణుదేవ్.. కేంద్రమంత్రిగానూ వ్యవహరించారు. 2023 ఎన్నికల్లో గిరిజనుల ఓట్లను ఆకర్షించడంలో విష్ణుదేవ్ సాయ్ కీలకంగా వ్యవహరించారు.



ఛత్తీస్‌గఢ్ కొత్త సీఎంగా విష్ణుదేవ్ సాయ్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన విష్ణుదేవ్ వారం రోజుల సస్పెన్స్‌కు బీజేపీ అధిష్టానం తెరదించింది. ఛత్తీస్‌గఢ్ కొత్త ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయ్‌ను బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. సీఎం ఏంపిక కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ.. ఎమ్మెల్యేలతో భేటీ తర్వాత నిర్ణయం తీసుకుంది. మొత్తం 54 మంది ఎమ్మెల్యేలు బీజేపే శాసనసభాపక్షనేతగా విష్ణుదేవ్ సాయ్‌ను ఎన్నుకున్నారు. విష్ణుదేవ్ సాయ్ గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ప్రధాని మోదీ తొలి కేబినెట్‌లో కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు. మరోవైపు ఛత్తీస్‌గడ్ మాజీ సీఎం రమణ్‌సింగ్‌ను పక్కన బెడుతూ.. కొత్త వ్యక్తి వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపింది. అంతకుముందు బీజేపీ శాసనసభా పక్ష నేతను ఎన్నుకునేందుకు బీజేపీకి చెందిన 54 మంది ఎమ్మెల్యేలు రాయ్?పూర్‌లో సమావేశమయ్యారు. వీరితో కేంద్రమంత్రులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, పార్టీ జనరల్ సెక్రటరీ దుష్యంత్ కుమార్ గౌతమ్, ఛత్తీస్‌గడ్ బీజేపీ ఇంఛార్జ్ ఓమ్ మాథూర్, మరో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ భేటీ అయ్యారు. ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అనంతరం బీజేపీ శాసనసభాపక్ష నేతగా విష్ణుదేవ్ సాయ్‌ను ఎన్నుకున్నారు. 59 ఏళ్ల విష్ణుదేవ్ సాయ్ ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లోని కున్‌కురీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. శాసనసభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బీజేపీ దాదాపు క్లీన్ స్వీప్ చేయగా.. ఇందులో విష్ణుదేవ్ సాయ్ కీలకపాత్ర పోషించారు. విష్ణుదేవ్ సాయ్.. సాహు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాగా.. దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్ పూర్ డివిజన్లలో ఈవర్గం జనాభా అధికంగా ఉంది. మరోవైపు విష్ణుదేవ్ సాయ్ గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు ఎంపీగా గెలిచారు. రాయ్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి 1999 నుంచి 2014 వరకూ నాలుగుసార్లు ఎంపీగా గెలుపొందారు. అయితే 2019 ఎన్నికల్లో ఆయనకు బీజేపీ అధిష్టానం టికెట్ ఇవ్వలేదు మూడుసార్లు ఛత్తీస్‌గఢ్ బీజేపీ అధ్యక్షునిగా ఉన్నారు. ఐదురాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా ఇటీవల ఛత్తీస్‌గఢ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. 90 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 54 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. 2018లో 68 సీట్లు కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఈసారి 35 సీట్లకు పరిమితమైంది. గోండ్వానా గణతంత్ర పార్టీకి ఒక సీటు వచ్చింది. అయితే శాసనసభ ఫలితాలు వెల్లడి అయ్యి వారం రోజులు కావస్తున్నా.. సీఎంను ఎంపికచేయలేకపోతున్నారటూ కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే విష్ణుదేవ్ సాయ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది బీజేపీ అధిష్టానం.
2018 ఎన్నికల్లో గిరిజనులు అధికంగా ఉన్న సర్‌గుజా డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం ప్రదర్శించింది. ఈ డివిజన్‌లో ఉన్న 14 స్థానాలను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. అయితే 2023 ఎన్నికల్లో విష్ణుదేవ్ సాయ్ ప్రభావంతో ఈసారి హస్తం పార్టీకి చుక్కెదురైంది. ఈ డివిజన్‌లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ జనాభాలో ఎస్టీల వాటా 32 శాతం కాగా.. బీజేపీ 29 సీట్లు కేటాయించింది. వాటిలో 17చోట్ల గెలుపొందింది.

# వేలిముద్రలు లేకున్నా ఆధార్ పొందొచ్చు..




ఆధార్. ఇది ఇప్పుడు మన దేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు కార్డు. అయితే ఆధార్ కార్డు తప్పనిసరి కాదు అని ప్రభుత్వం ఎన్నిసార్లు చెప్పినా.. దాని అవసరం మాత్రం నిత్యం ఏదో ఒక రకంగా ఉంటూనే ఉంది. కానీ కొందరి వేలి ముద్రలు పడకపోవడంతో ఆధార్ కార్డు పొందడం కష్టంగా మారింది. అయితే అలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఒక గుడ్ న్యూస్ చెప్పింది. ఆధార్ కార్డు పొందడానికి వేలిముద్రలు తప్పనిసరిగా కావాలి. అయితే వేళ్లు లేని వారు.. వేలి ముద్రలు సరిగా పడని వారికి కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఐరిస్ ద్వారా ఆధార్ పొందవచ్చని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీశాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. వేళ్లు లేవని, వేలి ముద్రలు సరిగా పడటం లేదన్న పేరుతో ఆధార్‌ను తిరస్కరించలేరని స్పష్టం చేశారు. తనకు చేతి వేళ్లు లేని కారణంగా ఆధార్‌లో పేరు నమోదు చేయించుకోలేక పోతున్నానంటూ కేరళకు చెందిన జోసిమల్ పీ జోస్ చేసిన విజ్ఞప్తిపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్ర శేఖర్ స్పందించారు. కేరళలోని కొట్టాయం జిల్లా కుమరకోం పట్టణంలో వేళ్లు లేని జోసిమోల్ పి.జోస్ అనే మహిళ ఇంటికెళ్లి సిబ్బంది ఆధార్ నమోదు చేసిన విషయాన్ని శనివారం కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ గుర్తు చేశారు. ఆమె విషయంలో మంత్రి జోక్యం చేసుకుని ఆధార్ ఇప్పించారు. వేలి ముద్రలు ఇవ్వలేని వాళ్లు ఐరిస్ స్కాన్ ద్వారా ఐరిస్ సరిగా రానివాళ్లు వేలిముద్రల ద్వారా ఆధార్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎవరికైనా వేలి ముద్రలు, ఐరిస్ రెండూ లేకపోతే అవి లేకుండానే ఆధార్ కోసం పేర్లు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. అలాంటివారు బయోమెట్రిక్ ఎక్సెప్షన్ ఎన్‌రోల్‌మెంట్ గైడ్‌లైన్స్ కింద పేరు, లింగం, చిరునామా, పుట్టిన తేదీ వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఆ వివరాలతో కూడిన బయోమెట్రిక్స్ ఇస్తే సరిపోతుందని తెలిపారు. వాళ్ల దగ్గర ఏయే అంశాలు లేవో ఆ వివరాలను ఎన్‌రోల్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయడంతోపాటు.. మార్గదర్శకాలకు అనుగుణంగా ఫొటోగ్రాఫ్ తీసుకోవాలని సూచించారు. ఈ నిబంధనలను పాటించిన అనంతరం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్ సూపర్‌వైజర్ ధ్రువీకరిస్తే సరిపోతుందని వెల్లడించారు. ఇక జోసిమల్ చేసిన విజ్ఞప్తితో అదే రోజే యూఐడీఏఐ అధికారులు రంగంలోకి దిగారు. కొట్టాయం జిల్లాలోని కొమరకంలో ఆమె ఇంటికి వెళ్లి ఆధార్ నెంబర్‌ను నమోదు చేయించారని రాజీవ్ చంద్రశేఖర్ ఒక ప్రకటన లో తెలిపారు. జోసిమల్‌లా ఎవరికైనా చేతివేళ్లు లేకపోయినా ఉన్నా వేలి ముద్రలు సరిగా పడక పోయినా ఇతర ఏదైనా వైకల్యం కారణంగా ముద్రలు వేయలేకపోయినా ఇతర ప్రత్యామ్నాయ బయోమెట్రిక్ విధానాల ద్వారా వారి వివరాలు నమోదు చేసుకోవాలని అన్ని ఆధార్ సర్వీ స్ కేంద్రాలకు సలహా జారీ చేసినట్టు చెప్పారు.

# లా చదివి తన కేసును తనే వాదించుకున్న వ్యక్తి..

ఆ వ్యక్తి తనకు సంబంధం లేని ఒక హత్య కేసులో నిందితుడిగా చిత్రీకరింపబడ్డాడు. దీంతో చేయని తప్పుకు జైలు శిక్ష కూడా అనుభవించాడు. అయినా కుంగిపోకుండా ధైర్యంగా పోరాటం కొనసాగించాడు. న్యాయవాద విద్యను పూర్తి చేసి.. ఏకంగా లాయర్‌గా మారాడు. చివరికి తన కేసును తానే వాదించుకుని నిర్దోషిగా విడుదలయ్యాడు. అందుకోసం 12 ఏళ్లుగా న్యాయ పోరాటం చేశాడు.

లా చదివి తన కేసును తనే వాదించుకున్న వ్యక్తి
మన దేశంలో న్యాయవ్యవస్థపై చాలా నమ్మకం ఉంటుంది. అక్రమ కేసుల్లో ఇరుక్కున్న వారికి న్యాయవ్యవస్థనే నిర్దోషులుగా చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. న్యాయం ఆలస్యమైనా చివరికి గెలుస్తుందని నిరూపించిన సంఘటనలు కోకొల్లలు. అదే విధంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 12 ఏళ్ల క్రితం జరిగిన జంట హత్యల కేసులో ఇరుక్కున్న ఓ వ్యక్తి.. లా చదివి ఆ కేసును వాదించి విజయం సాధించాడు. చివరికి ఆ అక్రమ కేసులో నిర్దోషిగా విడుదలయ్యాడు. దీంతో 12 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది.
2011 లో ఉత్తర్‌ప్రదేశ్ మీరట్‌లో ఇద్దరు కానిస్టేబుల్‌లు దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో అమిత్ చౌదరీ అనే 18 ఏళ్ల వ్యక్తిని నిందితుల్లో ఒకరిగా పోలీసులు గుర్తించారు. పోలీస్ సిబ్బంది హత్యకు గురి కావడంతో ఆ ఘటన యూపీ వ్యాప్తంగా పెను దుమారాన్ని రేపడంతో అప్పటి సీఎం మాయావతి తీవ్రంగా స్పందించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కేసులో మొత్తం 17 మందిని నిందితులుగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. అందులో 18 ఏళ్ల అమిత్ చౌదరీ కూడా ఉన్నాడు. వారిపై ఐపీసీతోపాటు నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ కింద కఠినమైన అభియోగాలు మోపారు. అయితే ఈ ఇద్దరు కానిస్టేబుల్‌ల హత్య వెనుక కైల్ అనే క్రిమినల్ ముఠా హస్తం ఉందని పోలీసులు గుర్తించారు. ఆ ముఠాలోనే అమిత్ చౌదరి భాగమని గుర్తించిన పోలీసులు అతడిని జైలుకు తరలించారు. 2 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన అమిత్ చౌదరీ.. ఈ కేసులో తాను నిర్దోషిని అని మొర పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే లా విద్యను చదవాలని నిర్ణయించుకున్నాడు. బాగ్‌పత్‌లోని కిర్తల్ గ్రామానికి చెందిన ఒక రైతు కుమారుడైన అమిత్ చౌదరీ.. జైలు జీవితాన్ని అనుభవించినా.. తన పట్టుదలను మార్చుకోలేదు. ముజఫర్‌నగర్ జైలులో శిక్ష అనుభవిస్తున్న భయంకరమైన గ్యాంగ్‌స్టర్‌లు అనిల్ దుజానా, విక్కీ త్యాగి తనను వారి గ్యాంగ్‌లలో చేర్చుకోవడానికి ప్రయత్నించారని అమిత్ చౌదరీ పేర్కొన్నాడు. అయితే ఆ జైలులో ఉన్న జైలర్.. తనను గ్యాంగ్‌స్టర్‌లు లేని బ్యారక్‌లో ఉంచినట్లు తెలిపాడు. ఇక 2 ఏళ్ల జైలు శిక్ష తర్వాత 2013 లో బెయిల్‌పై విడుదలైన అమిత్ చౌదరి.. ఈ కేసులో తాను నిర్దోషిని అని నిరూపించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే బీఏ ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎమ్ సహా పలు లా కోర్సులను చేశాడు. చివరికి బార్ కౌన్సిల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి న్యాయవాద పట్టాను అందుకున్నాడు. ఈ క్రమంలోనే తన కేసును తానే వాదించుకున్నాడు. అయితే ఆ ఇద్దరు కానిస్టేబుల్‌లను చంపిన కేసు ఎలాంటి సాక్షులు, వాంగ్మూలాలు లేకుండా నత్త నడకన సాగింది. ఈ క్రమంలోనే న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో చేరడానికి అన్ని అకడమిక్ అర్హతలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆ కేసు కోర్టు విచారణ జరపగా.. అమిత్ చౌదరీ నిందితుల తరఫున వాదించారు. ఈ క్రమంలోనే అమిత్ చౌదరీ సహా 13 మంది వ్యక్తులను ఈ కేసులో నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు సంచలన నిర్ణయం వెలువరించింది.
కానిస్టేబుళ్లు క్రిషన్‌పాల్, అమిత్ కుమార్‌లను హత్య చేయడానికి, వారి వద్ద ఉన్న తుపాకులను ఎత్తుకెళ్లేందుకు నిందితులు కుట్ర చేశారని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలం కావడంతో వారిని నిర్దోషులుగా కోర్టు గుర్తించింది. ఈ నేపథ్యంలోనే ఈ జంట హత్యల్లో అసలైన నిందితులైన సుమిత్ కైల్, నీతూ, ధర్మేంద్రలను దోషులుగా గుర్తించారు. అయితే 2013 లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుమిత్ కైల్ హత్యకు గురయ్యాడు. కానిస్టేబుల్‌లను చంపి వారి తుపాకీలను తీసుకున్నందుకు నీతుకు జీవిత ఖైదుతోపాటు రూ. 20 వేల జరిమానా కోర్టు విధించింది. తీర్పుకు ముందే ధర్మేంద్ర క్యాన్సర్‌తో మరణించాడు. అయితే భారత సైన్యంలో చేరాలనేది తన కల అని అమిత్ చౌదరీ పేర్కొన్నాడు. అయితే దానికి సిద్ధం అవుతుండగానే.. 2011 లో తన జీవితమే మారిపోయిందని పేర్కొన్నాడు. అయినప్పటికీ ఈ కేసు కారణంగా తాను లా కోర్సు చేసినట్లు తెలిపాడు. ప్రస్తుతం క్రిమినల్ జస్టిస్‌లో పీహెచ్‌డీ చేయాలనుకుంటున్నట్లు వివరించాడు.

# ఇంగువ నీళ్లు తాగితే షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది





చెట్టు వేర్ల నుంచి లభించే ఇంగువ జీర్ణ రసాలు ఉత్పత్తి అవడానికి తోడ్పడుతుంది. ఎంజైమ్‌ల చర్యను ప్రభావితం చేస్తుంది. దీంట్లో ఔషధాల గుణాలూ ఎక్కువే. ఇంగువ నీళ్లు తాగితే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది, ఆహారంలోని పోషకాల శోషణకు సహాయపడుతుంది. ఇంగువ నీళ్లు అజీర్తి, కడుపులో మంట, అన్నం సరిగా జీర్ణమవకపోవడం లాంటి సమస్యలు దూరం అవుతాయి. జీవక్రియ ప్రక్రియలకు సహాయపడుతుంది. రోజూ ఇంగువ వాటర్ తాగితే.. జీవక్రియ మెరుగుపడుతుంది, తద్వారా శరీరంలోని కొవ్వు కరుగుతుంది..

జీవక్రియకు మేలు చేస్తుంది.. చెట్టు వేర్ల నుంచి లభించే ఇంగువ జీర్ణ రసాలు ఉత్పత్తి అవడానికి తోడ్పడుతుంది. ఎంజైమ్‌ల చర్యను ప్రభావితం చేస్తుంది. దీంట్లో ఔషధాల గుణాలూ ఎక్కువే. ఇంగువ నీళ్లు తాగితే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది, ఆహారంలోని పోషకాల శోషణకు సహాయపడుతుంది. ఇంగువ నీళ్లు అజీర్తి, కడుపులో మంట, అన్నం సరిగా జీర్ణమవకపోవడం లాంటి సమస్యలు దూరం అవుతాయి. జీవక్రియ ప్రక్రియలకు సహాయపడుతుంది. రోజూ ఇంగువ వాటర్ తాగితే.. జీవక్రియ మెరుగుపడుతుంది, తద్వారా శరీరంలోని కొవ్వు కరుగుతుంది.

యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి.. ఇంగువలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీవక్రియ వ్యాధులు, ఊబకాయంతో సంబంధం ఉన్న వాపును తగ్గించడానికి తోడ్పడుతుంది. తద్వారా బరువు కంట్రోల్‌లో ఉంటుంది, అనారో గ్యాల ముప్పు తగ్గుతుంది. కొన్ని పరిశోధనల ప్రకారం, ఇంగువ రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేయవచ్చు. ఇంగువ నీళ్లు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉంచడానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది ఆకలి కోరికలను నిర్వహించడానికి సహాయపడుతుంది.

ఎలా తయారు చేసుకోవాలి.. ఇంగువ వాటార్ తయారు చేయడానికి ముందుగా గ్లాస్ నీళ్లను ఐదు నిమిషాల పాటు మరిగించండి. ఆ తర్వాత చిటికెడు ఇంగువ వేయండి. దీన్ని కొంతసేపు అలానే ఉంచి.. ఫిల్టర్ చేసి ఇంగువ నీళ్లు తాగండి. మీకు కావాలనుకుంటే నిమ్మరసం, తేనె యాడ్ చేసుకోవచ్చు.

# ఎమోషనల్లీ స్ట్రాంగ్‌గా ఉన్నారో లేదో..






మానసికంగా దృఢంగా ఉంటేనే మంచి నిర్ణయాలు తీసుకోగలం. ఎలాంటి సమస్యలొచ్చినా ముందుకెళ్ళగలం. అందరూ మానసికంగా దృఢంగా ఉండరు. దీని వల్లే చాలా సమస్యలొస్తాయి. మరి ఎమోషనల్లీ స్ట్రాంగ్‌గా ఉన్నారో లేదో ఎలా తెలుసుకోవాలో ఇప్పుడు చూడండి.

మీ గురించి మీకు కచ్చితమైన అవగాహన ఉందో లేదో తెలుసుకోండి. ఏ విషయాలు మీకు కోపం తెప్పిస్తాయి. మీ భావోద్వేగాలు ఎలా ఉంటాయి? మానసికంగా ఎలా ఉన్నారో తెలుసుకోండి. సొంత పనులపై అవగాహన ఉండడం, సరైన వ్యక్తిని ఎంచుకోవడం, ఇబ్బందులు రాకుండా తప్పించుకోవడం వంటివి తెలిసి ఉంటారు.

పరిస్థితులకి తగ్గట్టు.. ఇది ప్రతిఒక్కరూ చేయరు. ఏ పరిస్థితుల్లో ఉన్నా మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండి పరిస్థితిని అర్థం చేసుకుని ఆలోచనలు తీసుకుంటారు. అలాగే, ఎక్కువ ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటారు. ఇది సమస్యలు సాల్వ్ చేయడానికి, కొత్త విషయాలని అర్థం చేసుకోవడానికి హెల్ప్ చేస్తుంది.

వదులుకోవడం.. కొన్ని పరిస్థితుల్లో మనం ఏం చేయలేమనుకుంటే దానిని వదులుకోవడానికి కూడా వెనుకాడరు. వదులుకోవడం వల్ల వచ్చే ప్రతి ప్రాబ్లమ్‌ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటారు. ఇది వారికి గొప్ప సక్సెస్. అలాగే వారు ఎవరినైనా అర్థం చేసుకోగలరు. చాలా మందికి ఇతరులని అర్థం చేసుకోవడం కష్టం. కానీ, ఇతరులు భావాలను అర్థం చేసుకోవడం, వారికి అవసరమైన సాయాన్ని అందించడం ఎమోషనల్లీ స్ట్రాంగ్‌గా ఉన్నవారు చేస్తారు. ఎవరైనా ఏమైనా సాధిస్తే వారిని అప్రిషియేట్ చేస్తారు. ప్రతి ఒక్కరి విషయంలోనూ పాజిటీవ్‌గా ఉంటారు. తమ చుట్టూ ఉన్నవారికి సపోర్ట్ ఇస్తారు. సొంతంగా స్టాండ్ తీసుకుంటారు. కచ్చితమైన అభిప్రాయాలను కలిగి ఉంటారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అభిప్రాయాలను మార్చుకోరు.

# వాము ఆకులని నమిలి తింటే...





వాము ఆరోగ్యానికి ఎంత మంచిదో.. వాము ఆకులు అంతేకంటే ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇందులో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. దీంతో బాడీలో రక్తహీనత దూరమవుతుంది. వీటిని తినడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.

కిడ్నీ రాళ్ళు.. ఈ ఆకులు తింటే ట్యాక్సిన్స్ శరీరం నుండి బయటికి వెళ్తాయి. అందుకోసం ఈ ఆకులని తేనె, వెనిగర్‌తో కలిపి తీసుకోవచ్చు. కిడ్నీల్లో రాళ్ళ సమస్య తగ్గుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని బ్యాలెన్స్ చేస్తాయి. ఇది ఇమ్యూనిటీని పెంచుతుంది.

నోటి దుర్వాసన.. వాము ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోటి ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. ఈ ఆకులని నమిలితే నోటిలోని బ్యాక్టీరియా తగ్గుతుంది. కావిటీస్, నోటి దుర్వాసన, ఇతర నోటి ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

రక్తహీనత దూరం.. చాలా మంది ఐరన్ లోపంతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఈ ఆకులని తింటే ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తహీనత దూరమవుతుంది. దీనికోసం జ్యూస్‌లా కూడా తీసుకోవచ్చు.

పీరియడ్స్ టైమ్‌లో నొప్పి.. పీరియడ్స్ టైమ్‌లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యల్ని తగ్గించడంలో వాము ఆకులు హెల్ప్ చేస్తాయి. వీటిని తింటే పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పి తగ్గుతుంది.

జీర్ణసమస్యలు.. కొన్ని అధ్యయనాలు ప్రకారం, వాము ఆకులని తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇందులో యాంటీ యాసిడ్ లక్షణాలు గుణాలు ఉన్నాయి. దీని వల్ల కడుపు నుండి అదనపు ఆమ్లాన్ని తగ్గించి అసిడిటీ, గుండెల్లో మంటని తగ్గిస్తుంది.

కఫం దూరం.. చలికాలం, వర్షాకాలంలో చాలా మందికి జలుబు, దగ్గు వస్తుంటుంది. దీని కారణంగా కఫం వస్తుంటుంది. అయితే, వాము ఆకులని నమిలి తినడం వల్ల దగ్గు, జలుబు కాకుండా శ్వాస కోశ సమస్యలు కూడా దూరమవుతాయి. శ్లేష్మం దూరమవుతుంది.

వాము ఆకులోని పోషకాలు.. వాము ఆకుల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్స్, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ ఆకులని రెగ్యులర్‌గా తింటే చాలా సమస్యలు దూరమవుతాయి.

బరువు తగ్గడం.. ఈ ఆకుల్లో కేలరీలు, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల బరువు తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఈ ఆకులని నమిలి తింటే ఆకలి కంట్రోల్ అవుతుంది. కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. బరువు కంట్రోల్ అవుతుంది.

# గోర్లపై తెల్లగా మారాలంటే..











ఆరోగ్యంగా, పొడుగ్గా ఉండే గోర్లంటే అందరికీ ఇష్టమే. వీటి కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. గోర్లు పొడుగ్గా చాలా మందికే పెరుగుతాయి. కానీ, మనం రోజూ చేసే పనుల వల్ల నల్లగా మారతాయి. అలాంటి గోర్లను తెల్లగా మార్చాలంటే కొన్ని హెల్ప్ చేస్తాయి.

టూత్‌పేస్ట్.. టూత్‌పేస్ట్‌తో మీ గోర్లని సున్నితంగా స్క్రబ్ చేయండి. వైట్ టూత్‌పేస్ట్ మీ గోర్లపై మరకలు ఈజీగా పోతాయి. కాబట్టి, దీనిని అప్లై చేయండి. వీటితో పాటు మీ గోర్లని మరకలని తగ్గించేందుకు మీరు సిగరెట్ తాగడం తగ్గించాలి. గ్లాజెస్ వేసుకోవడం తగ్గించాలి. కొన్ని జెల్స్ రాయొచ్చు.

లెమన్ సాల్ట్.. నిమ్మ, ఉప్పు కలిపి స్క్రబ్ చేయడం వల్ల కూడా గోర్లు తెల్లగా మారతాయి. అందుకోసం ముందుగా సమాన భాగాల్లో నిమ్మరసం, ఉప్పు కలిపి పేస్టులా చేసి గోర్లపై రాయండి. కాసేపు ఉంచి ఆ తర్వాత క్లీన్ చేయండి. దీంతో గోర్లు తెల్లగా మారతాయి.

బేకింగ్ సోడా.. హైడ్రోజన్ పెరాక్సైడ్, బేకింగ్ సోడాని రెండింటిని కలిపి పేస్ట్‌లా చేయండి. దానిని కాటన్ సాయంతో గోర్లపై అప్లై చేసి బాగా రుద్దండి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో క్లీన్ చేయండి.

టీట్రీ ఆయిల్.. టీట్రీ ఆయిల్‌ని కొద్దిగా తీసుకుని గోర్లపై వేసి స్క్రబ్ చేయండి. ఇలా మీకు వీలున్నంత సేపు చేసి క్లీన్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే ఉపయోగం ఉంటుంది.

వైట్ వెనిగర్.. గోరువెచ్చని నీటిలో ఓ టీస్పూన్ వైట్ వెనిగర్ వేయండి. అందులో గోర్లని ఉంచి నాననివ్వండి. ఇప్పుడు శుభ్రమైన టవల్‌తో తుడవండి. చివర్లో లోషన్ రాయండి.

స్క్రబ్.. అదే విధంగా, గోర్లని ఎప్పటికప్పుడు స్క్రబ్ చేయాలి. దీంతో మరకలు మాయమవుతాయి. ఇందుకోసం నెయిల్ పాలిష్ న్యూట్రలైజర్‌ని వాడండి. తర్వాత, నెయిల్ స్క్రబ్ బ్రష్‌ని వాడి మీ గోర్లపై మరకల్ని దూరం చేయొచ్చు. అసిటోన్‌లో నానబెట్టిన కాటన్ ప్యాడ్‌తో మీ గోళ్ళని క్లీన్ చేయండి.

బేకింగ్ సోడా, నిమ్మరసం..

గోర్లని తెల్లగా చేయడంలో బేకింగ్ సోడా, నిమ్మరసం చాలా బాగా పనిచేస్తాయట. సో అందుకోసం బేకింగ్ సోడా, నిమ్మరసం కలిపి పేస్టులా చేయాలి. దీనిని గోర్లపై 30 సెకన్ల పాటు రుద్దండి. తర్వాత ఓ 10 నిమిషాల పాటు ఉంచి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి.

# కిచెన్ సామాన్లతో అడుకుంటుంటే అడ్డుపడుతున్నారా..?



ఇంట్లో చంటి పిల్లలు ఉంటే.. ఇల్లు ఇల్లులా ఉండదు. ఇక పాకుతుండే, నడిచే పిల్లలు ఉంటే.. చిందరవందరగా ఉంటుంది. ఇల్లాంతా బొమ్మలు, కిచెన్ సామాన్లు, బుక్స్, కూరగాయలు పరిచేసి ఉంటాయి. పిల్లలకు ఆడుకోవడానికి ఎన్ని బొమ్మలున్నా.. కిచెన్ సామాన్లు కనిపిస్తే వదిలిపెట్టరు. ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలతో నానా రచ్చ చేస్తుంటారు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలు కిచెన్ సామాన్లు, కూరగయాలతో అడుకుంటుంటే, వాళ్ల నుంచి అవి బలవంతంగా లాగేసుకుంటూ ఉంటారు. వాళ్ల చేతికి బొమ్మలు తీసుకొచ్చి ఇస్తుంటారు. అయితే, పిల్లలను కిచెన్ సామాన్లతో అడుకోనివ్వాలని ప్రముఖ డాక్టర్ ఛాయా షా అన్నారు. పిల్లలను బొమ్మలకు బదులుగా, కిచెన్ సామాన్లతో ఎందుకు ఆడుకోనివ్వాలో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో వివరించారు. పిల్లలు కిచెన్ సామాన్లతో ఆడితే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో తెలిపారు.





వారిలో కమ్యూనికేషన్‌స్కిల్స్‌పెరుగుతాయి.. పిల్లలు.. కిచెన్‌సామాన్లు, గిన్నెలు, ప్లేట్లతో ఆడుకుంటే వారిలో కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని డాక్టర్‌ఛాయ అన్నారు. అంటే, పిల్లలు త్వరగా మాట్లాడటం నేర్చుకుంటారు, ఎక్కువ పదాలను తెలుసుకుంటారు. మీ చిన్నారి ఇంకా మాట్లాడం స్టార్ట్‌చేయకపోతే.. వాళ్లకు మాటలు త్వరగా నేర్పించాలనుకుంటే వాళ్లు ఆడుకోవడానికి కిచెన్‌సామాన్లు ఇచ్చేయండి. పాత్రలతో ఆడుకోవడం ద్వారా పిల్లవాడు వాటి పేర్లను కూడా నేర్చుకుంటాడని డాక్టర్ షా చెప్పారు. కూజా, జగ్, చెంచా వంటి అనేక పదాలను మాట్లాడటం నేర్చుకుంటాడు.


మోటార్‌స్కిల్స్‌పెరుగుతాయి.. చిన్నారులు కిచెన్‌పాత్రలు, గిన్నెలతో ఆడుకుంటే వారిలో మోటార్‌స్కిల్స్‌పెరు గుతాయి. ప్రకారం, చక్కటి మోటార్‌స్కిల్స్‌అంటే.. మన చేతులు, మణికట్టులోని చిన్న కండరాలను కదిలించే సామర్థ్యం పెరుగుతుంది. మీ చిన్నారిలో మోటర్‌నైపుణ్యాలు పెరుగుపరచడం చాలా ముఖ్యం. చిన్నారి.. పాత్రలు, స్పూన్లు, ప్లేట్లు వంటి వివిధ ఆకృతుల పాత్రలను పట్టుకున్నప్పుడు, అది అతని చేతి, వేళ్లు, మణికట్టులోని చిన్న కండరాలు అభివృద్ధి చెందడానికి సహాయపడతాయి.

చదువులో సహాయపడతాయి.. చిన్నపిల్లలు కిచెన్‌సామాన్లు, గిన్నెలతో అడుకుంటే.. అది వారి చదువులోని సహాయపడుతుందని డాక్టర్‌ఛాయా అన్నారు. పిల్లలు సైన్స్, ఫిజిక్స్, మ్యాథ్స్‌వంటి సబ్జెక్ట్‌స్కిల్స్‌ను నేర్చుకుంటారు. కాబట్టి, మీ పిల్లవాడు పెద్దయ్యాక చదువులో ముందు ఉండాలనుకుంటే, పసి వయస్సులో వారిని కిచెన్‌పాత్రలతో ఆడుకోనివ్వండి.

ఇంద్రియాలు అభివృద్ధి చెందుతాయి.. చిన్నారులు కిచెన్‌సాన్లతో అడుకుంటే.. వారిలో ఇంద్రియాలు అభివృద్ధి చెందుతాయని డాక్టర్‌షా అన్నారు. చూడటం, వినడం, తాకడం, రుచి చూడటం, వాసన చూడటం లాంటివి త్వరగా అభివృద్ధి చెందుతాయి. మనం మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోగలుగుతాం. పిల్లలు వివిధ పాత్రలు, మెటల్, ప్లాస్టిక్ లేదా ఉక్కు వంటి లోహాలను తాకినప్పుడు, అది వారిలో ఇంద్రియ అభివృద్ధికి సహాయపడుతుంది.

# ప్రతి సంవత్సరం.. చేయించుకోవాలి..!







రక్తహీనత, ఇన్ఫెక్షన్లు, విటమిన్ల లోపం, కొలెస్ట్రాల్ స్థాయిలను గుర్తించడానికి బ్లడ్ టెస్ట్ కచ్చితంగా వంటి తీవ్ర పరిస్థితులను గుర్తించడానికీ.. రక్త పరీక్ష ఉత్తమ మార్గం. బ్లడ్ టేస్ట్ అనారోగ్యాలను గుర్తించడానికే కాదు.. శరీరంలో జరిగే అనేక మార్పులను తెలుసుకోవడానికీ సహాయపడుతుంది.

అందుకే, మన హెల్త్ ట్రాక్ చేయడానికీ డాక్టర్స్ బ్లడ్ టెస్ట్ ప్రిస్క్రైబ్ చేస్తూ ఉంటారు. అయితే, కొన్ని బ్లడ్ టెస్ట్‌లు ప్రతి ఏడాదీ కచ్చితంగా చేయించుకోవాలని నిపుణులు అంటున్నారు.

లిపిడ్ ప్యానల్ బ్లడ్ టెస్ట్.. రెండు రకాల కొలెస్ట్రాల్ స్థాయిలను గుర్తిస్తుంది. అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ లేదా లేదా మంచి కొలెస్ట్రాల్. మంచి కొలెస్ట్రాల్ మన రక్తం నుంచి హానికరమైన పదార్థాలను తొలగిస్తుంది. లివర్ వాటిని వ్యర్థాలుగా విభజించడానికి సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ ధమనులలో ఫలకాన్ని కరిగిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. లిపిడ్ ప్యానల్ టెస్ట్ చేయించుకోవడానికి.. 8 గంటల పాటు ఉపవాసం ఉండాలి. థైరాయిడ్ గ్రంథి థైరాయిడ్-స్టిమ్యులేటింగ్ హార్మోన్ ట్రైయోడోథైరోనిన్ నిర్దిష్ట హార్మోన్లను ఎలా ఉత్పత్తి చేస్తుందో, వాటికి ఎలా స్పందిస్తుందో తెలుసుకోవడానికి సహాయపడుతుంది.

# దశ తిరిగింది..



తెలుగు సినీ ప్రేక్షకులకు యువ నటుడు రోషన్ సుపరిచితమే. ప్రముఖ నటుడు శ్రీకాంత్, నటి ఊహల కుమారుడిగా సినీ నేపథ్యంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోషన్ టీనేజ్‌లోనే రెండు మూడు చిత్రాలతో అలరించాడు. 2016లో విడుదలైన 'నిర్మలా కాన్వెంట్' చిత్రంతో హీరోగా పరిచయమైన రోషన్ తొలి సినిమాతోనే నటనపరంగా మంచి మార్కులు సంపాదించి సైమా ఉత్తమ తొలి నటుడు అవార్డును కూడా అందు కోవడం విశేషం. ఆ తర్వాత పెళ్లి సందD వంటి చిత్రాల్లో నటించినప్పటికీ నటన పరంగా విమర్శలు రావడంతో కాస్త గ్యాప్ తీసుకుని తనను తాను మరింత మెరుగుపరుచుకునే దిశగా కెరీర్‌ను మలుచుకున్నారు. పాత్రల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ, పరిపక్వమైన కథలను ఎంచుకోవాలనే ఆలోచనతో కొంత గ్యాప్ తీసుకుని మళ్లీ ప్రేక్షకుల ముందుకొచ్చాడు. రోషన్ కెరీర్‌లో తాజాగా విడుదలైన 'ఛాంపియన్' సినిమా కీలక మలుపుగా మారింది. ఫుట్‌బాల్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ డ్రామాలో రోషన్ నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పాత్రలో ఒదిగిపోయిన ఆయన ప్రదర్శన టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాను చూసిన ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ రోషన్ నటనకు ఆకర్షితులై వ్యక్తిగతంగా అభినందించి, గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో సినిమా అవకాశం ఇచ్చినట్లు సమాచారం.

మరోవైపు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా రోషన్‌తో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

'ఛాంపియన్' సినిమాను ఇటీవలే వీక్షించిన ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ రోషన్ నటనకు ముచ్చటపడ్డారు. సినిమాను చూసిన వెంటనే రోషన్‌ను వ్యక్తిగతంగా కలిసి అభినందించిన ఆయన.. తనకి గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. ఇది రోషన్ కెరీర్‌లో కీలకమైన మైలురాయిగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, 'ఛాంపియన్' సినిమాతో రోషన్ కెరీర్ కొత్త దశలోకి అడుగుపెట్టినట్టే కనిపిస్తోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో ముందుకు సాగాలనే ఆయన ఆలోచనకు ఇప్పుడు అవకాశాలు కలిసి వస్తుండటం టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. ఇకపై గ్యాప్ తీసుకోనని రెండేళ్లకు మూడు సినిమాల చొప్పున ప్రేక్షకుల ముందుకొస్తానంటూ రోషన్ చెప్పిన మాట నిజమయ్యేలాగే కనిపిస్తోంది.



# సినిమాలకి గుడ్ బై

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళనాట మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ఆయనకు భారీ ఫ్యాన్ బేస్ ఉంది. ఇమేజ్ పరంగా అభిమానుల్లో ఆయన స్థానం ఎక్కడా తగ్గలేదు. అలాంటి విజయ్ సినిమాలకు గుడ్‌బై చెప్పి పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకోవడం సినీ వర్గాల్లోనే కాదు, అభిమానుల్లోనూ పెద్ద చర్చకు దారి తీసింది. వచ్చే మూడు దశాబ్దాల పాటు రాజకీయాల్లోనే కొనసాగి ప్రజాసేవ చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 'జననాయగన్' సినిమా విజయ్ కెరీర్‌లో చివరి చిత్రంగా నిలవనుంది.

విజయ్ చివరి సినిమాగా తెరకెక్కుతున్న 'జననాయగన్' చిత్రంపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. హెచ్ వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, మమిత బైజు కీలక పాత్రలో కనిపించనుంది. రాజకీయ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్‌ను ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో చూపించబోతున్నారని మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.

షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ప్రమోషన్స్ కూడా భారీ స్థాయిలో ప్లాన్ చేయడంతో సినిమాపై హైప్ రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 'జననాయగన్' ఆడియో లాంచ్ ఈవెంట్‌ను మలేషియాలో ఘనంగా నిర్వహించారు. దళపతి కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ ఆడియో లాంచ్ ఈవెంట్‌గా నిలిచిందని చెప్పాలి. చివరి సినిమా కావడంతో అభిమానులు ఈ కార్యక్రమాన్ని పండుగలా సెలబ్రేట్ చేశారు. ఈ ఈవెంట్‌లో విజయ్ అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చారు. 'దళపతి కచేరి' పాటకు స్టేజ్‌పై డ్యాన్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించారు. సాధారణంగా ఆడియో లాంచ్ ఈవెంట్స్‌లో ఎక్కువగా మాట్లాడే విజయ్, ఈసారి డ్యాన్స్ ద్వారా తన ప్రేమను వ్యక్తం చేయడం అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది. విజయ్ డ్యాన్స్‌కు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చివరి సినిమాకి ఇలాంటి మధుర జ్ఞాపకాన్ని మిగల్చడంపై ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కొత్త పోస్టర్ అదిరింది!

సంక్రాంతి బరిలో ఈసారి మెగాస్టార్ చిరంజీవి స్పీడ్ మరింత పెరిగింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న పక్కా కమర్షియల్ సినిమాగా ఇది తెరకెక్కుతుండటంతో అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపిస్తోంది. ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్నారు. చిరంజీవి, వెంకటేష్‌లపై ఓ పార్టీ సాంగ్ షూట్ చేయగా తాజాగా దానికి సంబంధించిన ప్రోమో సోషల్‌మీడియాలో దుమ్మురేపుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు మాస్ ఆడియెన్స్‌ను బాగా ఆకట్టుకున్నాయి.



ముఖ్యంగా చిరంజీవి స్టెప్స్, అనిల్ రావిపూడి మార్క్ హ్యూమర్ పాటల్లో స్పష్టంగా కనిపించడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌కు చిరు మాస్ ఇమేజ్, కామెడీ టైమింగ్ కలిస్తే ఎలాంటి వినోదం వస్తుందన్న దానిపై ట్రేడ్ వర్గాల్లో కూడా పాజిటివ్ బజ్ నెలకొంది. నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ సినిమాను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించారు. విడుదలకు సమయం దగ్గరపడుతుం డటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా సినిమా విడుదలకు కేవలం 15 రోజుల సమయం మాత్రమే ఉందని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో చిరంజీవి కొబ్బరి బోండం తాగుతూ స్టైలిష్ లుక్‌లో కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. సాధారణంగా మాస్ పోస్టర్లతో అలరించే చిరు, ఈసారి కాస్త లైట్, ఫన్ టచ్‌తో కనిపించడంతో ఫ్యాన్స్ ఈ పోస్టర్‌ను తెగ షేర్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ లుక్ ట్రెండింగ్‌గా మారి సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. ఇదిలా ఉండగా, ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'మన శంకర వరప్రసాద్ గారు' క్రేజ్ స్పష్టంగా కనిపిస్తోంది. అమెరికాలో ఈ సినిమాకు సంబంధించిన బుకింగ్స్ అధికారికంగా ఓపెన్ చేసినట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించారు. యూఎస్ ప్రీమియర్స్‌ను జనవరి 11న గ్రాండ్‌గా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతికి ముందే బాక్సాఫీస్ బజ్ మొదలవ్వాలన్న ఉద్దేశంతో ఈ ప్రీమి యర్స్‌ను భారీగా డిజైన్ చేసినట్లు సమాచారం. జనవరి 11 ప్రీమియర్స్‌తోనే 'మన శంకర వరప్రసాద్ గారు' రేంజ్ ఏంటో తేలిపోతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# డ్రీమ్ నెరవేరేనా



గత ఐదు దశాబ్దాలుగా సినీ అభిమానులను అలరిస్తున్నారు. ఇటీవలే 75 ఏళ్లు పూర్తి చేసుకున్న తలైవర్.. గత కొన్నేళ్లుగా తన వయసుకు తగ్గ పాత్రల్లో నటిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. టాలీవుడ్ సీనియర్ హీరోలు ఇప్పటికీ యంగ్ హీరోయిన్లతో డ్యాన్సులు వేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తుంటే.. రజనీ మాత్రం హీరోయిన్లతో డ్యాన్సులు వేయాలని, డీఏజింగ్ టెక్నాలజీతో స్క్రీన్ పై యంగ్ గా కనిపించాలని కోరుకోకుండా.. తన ఏజ్ కి సూట్ అయ్యే క్యారెక్టర్లను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో తండ్రి, తాత పాత్రలు పోషించడానికి కూడా రెడీ అంటున్నారు. అలాంటి రజనీతో ఒక లవ్ స్టోరీ చేయాలని ఓ డైరెక్టర్ ఆశ పడుతున్నారు. అదే తన డ్రీమ్ అని చెబుతున్నారు.

రజనీకాంత్ తో ప్రేమకథ తీయాలనుకుంటున్న డైరెక్టర్ ఎవరో కాదు.. సుధా కొంగర . 'గురు', 'ఆకాశం నీ హద్దురా' వంటి సినిమాలతో ప్రేక్షకులకు మెప్పించిన ఆమె.. ఇప్పుడు 'పరాశక్తి' చిత్రంతో అలరించడానికి వస్తున్నారు. సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి రాబోతున్న ఈ మూవీ ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ప్రమోషన్స్ లో భాగంగా ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రజనీకాంత్‌తో ఓ ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కించాలనేది తన కల అని అన్నారు.

సుధా కొంగర మాట్లాడుతూ.. "నేను రజనీకాంత్ కి వీరాభిమానిని. నాకు లవ్ స్టోరీ సినిమాలంటే చాలా ఇష్టం. పూర్తిస్థాయి ప్రేమకథ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. అది రజనీ సర్ చేస్తే బాగుంటుంది. ఇప్పటికే నా దగ్గర ఓ స్టోరీ ఉంది. దాన్ని డెవలప్ చేయాలి" అని తెలిపారు. కుదిరితే రజనీతో 'ఆత్మబంధువు' లాంటి సినిమా తీయాలని సుధా ఆశ పడుతున్నారు. అందరూ సూపర్ స్టార్ తో సినిమా ఛాన్స్ వస్తే, ఆయన తరహా స్టైలిష్ యాక్షన్ మూవీస్ చేయాలని ఆశ పడుతుంటే.. సుధా కొంగర మాత్రం ఒక మెచ్యూర్ లవ్ స్టోరీ చేయాలని కోరుకోవడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది.

# రేసులో ఎవరున్నారంటే




తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు నేడు జరుగుతున్నాయి. ఈ ఉదయం 8 గంటల నుంచి మొదలయిన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగనుంది. సాయంత్రం 6 గంటల తర్వాత ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఫిల్మ్ ఛాంబర్‌లో భాగం అయిన ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్, స్టూడియో సెక్టార్స్ కలిపి మొత్తం సభ్యులు 3,355 మంది ఈ ఎన్నికల్లో ఓటు వేయబోతున్నారు. అధ్యక్ష కార్యదర్శిల తో పాటు 32 మంది కార్యవర్గ సభ్యులకు ఓటు వేయనున్నారు సభ్యులు.

ఈ సారి ఎగ్జిబిటర్స్ సెక్టార్ నుంచి అధ్యక్షుడిని ఎన్నుకోబోతున్నారు సభ్యులు. ప్రధానంగా ప్రోగ్రెసివ్ ప్యానెల్, మన ప్యానెల్ మధ్య పోటీ నెలకొంది. చిన్న నిర్మాతలు అంతా మన ప్యానల్ గా పోటీచేస్తుండగా అగ్ర నిర్మాతలు యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అంతా ప్రోగ్రెసివ్ ప్యానల్ గా పోటీ చేస్తున్నారు. చిన్న సినిమా నిర్మాతల మన ప్యానల్ ను సి కళ్యాణ్, చదలవాడ శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్ బలపరుస్తున్నారు. ప్రోగ్రెసివ్ ప్యానల్ ను అల్లు అరవింద్, దిల్ రాజు , సురేష్ బాబు బలపరుస్తున్నారు. గిల్డ్ పేరుతో కోట్లాది రూపాయల చిత్ర పరిశ్రమ సొమ్మును దోచుకుంటున్నారని చిన్న నిర్మాతల మన ప్యానెల్ సభ్యుల ఆరోపణ చేస్తున్నారు. పదవుల కోసం కాదు అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఈ ఎన్నికలు అని బడా నిర్మాతల ప్రోగ్రెసివ్ ప్యానెల్ సభ్యులు వాదిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఛాంబర్ ఎన్నికలు జగగనుండగా ప్రస్తుత ఛాంబర్ కార్యవర్గ పదవి కాలం జూలై లోనే ముగిసినా కూడా పలు కారణాల వల్ల ఎన్నికలు వాయిదా వేశారు. నేడు జరిగే ఎన్నికల్లో విజయం సాధించే నూతన కార్యవర్గం జూలై 2027 వరకు భాద్యతలు నిర్వహించనుంది. ఈ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందోననే ఉత్కంఠ టాలీవుడలో నెలకొంది.

# అప్పుడు బాలకృష్ణని ఎందుకు వదిలేశారు?

హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర వివాదానికి దారితీశాయి. 'దండోరా' ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా శివాజీ చేసిన కామెంట్స్ మహిళలను అవమానించేలా ఉన్నా యంటూ పలువురు విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు సినీ వర్గాలు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి కూడా తీవ్ర ప్రతి స్పందనలు వచ్చాయి. దీంతో ఈ అంశం రాజకీయ, సామాజిక చర్చగా మారింది. శివాజీ వ్యాఖ్యలపై ముందుగా చిన్మయి స్పందిస్తూ మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, సమాజంలో బాధ్యతా యుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యా నించారు. అలాగే నటి అనసూయ కూడా ఈ వ్యవహా రంపై స్పందిస్తూ, మహిళల గురించి మాట్లాడే టప్పుడు ఎవరూ హద్దులు దాట కూడదని మం డిపడింది. సినీ పరిశ్రమకు చెందిన పలువురు సెలబ్రెటీ లు కూడా శివాజీ వ్యాఖ్య లను తప్పు బట్టారు. ఇక నటుడు ప్రకాష్‌రాజ్ ఈ అంశంపై తీవ్రంగా స్పందిం చారు. మహిళల గౌరవాన్ని దెబ్బ తీసేలా మాట్లా డటం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థ నీయం కాదని ఆయన వ్యాఖ్యా నించారు. అలాగే మెగా బ్రదర్ నాగబాబు కూడా శివాజీ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సమాజంలో సెలబ్రిటీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఈ వరుస స్పందనలతో శివాజీ వ్యాఖ్యల వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో మహిళా కమిషన్ కూడా స్పందించింది. శివాజీ వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి ఆయన్ని విచారణకు పిలిపించారు. మహిళా కమిషన్ ముందు శివాజీ హాజరై తన వాదన వినిపించారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, ఎవరినీ అవమానించాలన్న ఉద్దేశం లేదని ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ విచారణ తర్వాత కూడా వివాదం చల్లారలేదు.



# '666..'లో మరో సర్‌ప్రైజ్



హీరో ధనంజయ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా '666: ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఇప్పటికే పలువురు స్టార్స్‌తో నిండిన ఈ సినిమాలోకి ఇప్పుడు పాపులర్ హీరోయిన్ ప్రియాంక మోహన్ జాయిన్ అయ్యారు. తాజాగా ఈ సినిమాలో ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను మేకర్స్ విడుదల చేశారు.రెండు వేర్వేరు పోస్టర్లలో విడుదలైన ఈ ఫస్ట్ లుక్స్‌లో ప్రియాంక మోహన్ తీరు చూస్తుంటే అందం, రహస్యం, ఫాంటసీ అన్నీ కలిగలిసిన ఓ వైవిధ్యమైన, ప్రత్యేకమైన కథా ప్రపంచం ఈ సినిమాలో ఉండబోతున్నట్టుగా అనిపిస్తోంది. దీంతో సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమా నుంచి వచ్చిన డా. శివరాజ్‌కుమార్, ధనంజయ ఫస్ట్ లుక్స్ నుంచి భారీ సెట్స్, వింటేజ్ కెమరాలతో, జనవరిలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను వైశాక్ జె ఫిలిమ్స్ బ్యానర్‌పై హేమంత్ ఎం.రావు దర్శకత్వంలో వైశాక్ జె. గౌడ నిర్మిస్తున్నారు. చరణ్ రాజ్ సంగీత సారథ్యాన్ని వహిస్తుండగా, అద్వైత గురుమూర్తి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. విశ్వాస్ కశ్యప్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఇంచారా సురేష్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.